
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 19.02.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 38 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

• తెదేపా - వైకాపాల మధ్య

# గోబెల్స్ గేమ్

■ తెలంగాణలో తుడిచి పెట్టుకుపోతున్న దేశం

■ ఏపిలో వైకాపాను తుడిపేయాలనుకుంటున్న బాబు

క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ... వీటిలాగే రాజకీయం కూడా ఒక ఆట. అయితే వాటితో శక్తి సామర్థ్యాలతో పాటు గట్టిగా పోరాడితే గెలుస్తారు. కాని రాజకీయం అనే ఆటలో గెలవడానికి కేవలం శక్తి సామర్థ్యాలే కాదు కొంచెం కన్నింగ్ మనస్తత్వం కావాలి. అబద్ధాలు ఆడగల నేర్పు, ఎదుటివారు తిట్టినా భరించగల ఓర్పు ఉండాలి. అబద్ధాన్ని నిజమని నమ్మించాలి. ఇవన్నీ చేసినవాడే రాజకీయాలలో నెగ్గుకు రాగలడు.

చంద్రబాబు విజయంలో, జగన్ ఓటమిలో వున్న అసలు రహస్యం కూడా ఇదే! అబద్ధాన్ని కూడా అందంగా చెప్పబట్టే 2014 ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి రాగలిగితే, అబద్ధాన్ని చెప్పమన్నా చేతకాక అధికారంలోకి రావాల్సిన జగన్ ప్రతిపక్ష నేతగా మిగిలాడు.

మా పార్టీ అధికారంలోకి వస్తే పూర్తిగా రైతు ఋణ మాఫీ చేస్తాను, కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తాను అనే రెండు అబద్ధాలు చంద్రబాబు చెప్పకపోయుంటే ఆయన ఈరోజు సీఎంగా ఉండే వాడు కాదు. ఆ రెండు పాయింట్లే తెలుగుదేశంను అధికారంలోకి తీసుకొచ్చాయి. ఒకవేళ అప్పుడు జగన్ కూడా... నేను సీఎంను అయితే రైతు ఋణమాఫీ చేస్తానని ఒక అబద్ధం చెప్పి వున్నా ఈరోజు పొజిషన్ వేరుగా ఉండేది. (మిగతా 11వ పేజీలో)

కాంగ్రెస్ హీరో

# దేశానికి జీరో



11లో



# షాడో మేయర్

* కార్పొరేషన్‌లో అవినీతి రాజ్యం
* కలెక్షన్‌లే లక్ష్యం - అక్రమాలే మార్గం
* అన్నపాలనలో తమ్ముడి పెత్తనం

*పాలకులు మారినా నెల్లూరు నగర పాలక సంస్థ రాత మారడం లేదు. ఎలుకలు తినే వాళ్లు పోతే ఏనుగులు తినేవాళ్లొచ్చారన్నట్లుగా ఇక్కడి పాలకులు తయారవుతున్నారు. గత పాలకులనే మంచనిపించేలా, గత పాలకవర్గం అవినీతే కొంచెం తక్కువగా ఉందనిపించేలా కొత్త పాలకవర్గం తయారవుతోంది. నెల్లూరులో దోమలు పెరిగినట్లే, పందులు బలిసినట్లే, కుక్కలు విస్తరించినట్లే నగర పాలక సంస్థ అవినీతి కూడా పెరిగిపోతోంది. చివరికి నెల్లూరు నగరపాలక సంస్థను ఏ స్థాయికి చేర్చారంటే... నగర ప్రజల సమస్యలను తీర్చే పాలనా కేంద్రంగా కాకుండా అవినీతి కలెక్షన్‌లు దండుకునే వ్యాపార కేంద్రంగా మార్చారు. విచ్చలవిడి అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా దీనిని మలిచారు.*

ఒకరుపోతే ఒకరు... ఒకరి తర్వాత ఒకరు... నెల్లూరు నగరపాలకులుగా నెల్లూరు ప్రజల సొమ్మును పీక్కుతినే వాళ్లే వస్తున్నారు. గత పాలకుల హయాంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఎంత అవినీతి మురికి కూపంగా మారిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అయితే అప్పుడు అవినీతితో పాటు కొన్ని అభివృద్ధి పనులన్నా జరిగాయి. ఇప్పుడైతే అవినీతి తప్ప అభివృద్ధి కనిపించడం లేదు.

నెల్లూరు మేయర్‌గా అబ్దుల్ అజీజ్ ఎన్నికైనప్పుడు నగర ప్రజలు సంతోషించారు. ఒక మైనార్టీ యువకుడు, విద్యావంతుడు మేయర్ అయ్యాడని, అవినీతికి దూరంగా పారదర్శక పాలనకు దగ్గరగా ఉంటాడని భావించారు. అజీజ్ కూడా ఆ విధంగానే మొదట నడుచుకున్నాడు. నేను పెద్ద వ్యాపారవేత్తనని, నా సంపాదనతో పోల్చుకుంటే ఈ కార్పొరేషన్ బడ్జెట్ అఫ్టాల్ అని చెప్పుకొచ్చాడు. ఇంత గట్టిగా చెబుతున్నాడంటే కార్పొరేషన్ సొమ్మును తన ఎడం చేత్తో కూడా తాకరని అందరూ నమ్మారు. మాటలైతే కోటలు దాటాయిగాని ఆచరణలో మాత్రం (మిగతా 11వ పేజీలో)



# మెట్ట తలరాత మారుతోంది!



పాడిపంటల కోస్తా, కరువు పీడిత సీమల సంగమమే నెల్లూరుజిల్లా. ఈ జిల్లాలో సగం ప్రాంతం పచ్చని పైర్లతో కళకళలాడుతుంటే సగం ప్రాంతం కరువు ఛాయలతో వెలవెలపోతుంటుంది. ముఖ్యంగా జిల్లాలోని పడమర వైపు భాగాన్నంతా మెట్టగా చెప్పుకోవచ్చు. ఇక్కడ కరువు ఎక్కువ. అభివృద్ధి తక్కువ. ఉదయగిరి, సీతారాంపురం, వింజమూరు, మర్రిపాడు, కలువాయి, చేజర్ల, బాలాయపల్లి, పొదలకూరు, డక్కిలి, సైదాపురం, వెంకటగిరి మండలాలు మెట్టలో కలుస్తాయి. తెలుగుగంగ కాలువలు లేకపోయుంటే వీటిలో కొన్ని మండలాల్లో మానవ జీవితం కూడా కష్టంగా ఉండేది. ఈ మండలాలలో సాగునీటి కొరత మూలంగా పంటలు అంతంత మాత్రమే! ఇక జిల్లాలో జరుగుతున్న పారిశ్రామికాభివృద్ధి అంతా కూడా సముద్రతీరప్రాంతం వైపే కేంద్రీకృతమవుతుంది. రైల్వే మార్గాలు, జాతీయ రహదారి ఉండేది కూడా తూర్పు వైపే! ఇంతవరకు మెట్టప్రాంతంలో అభివృద్ధికి ఎలాంటి మార్గాలు లేవు.

కాని ఇప్పుడు మెట్ట ప్రాంతంలోనూ అభివృద్ధి బీజాలు పడుతున్నాయి. ఒకే సమయంలో మెట్ట ప్రాంతంలో రోడ్డు, రైలు మార్గం పనులు జరుగుతుండడం పట్ల ఈ ప్రాంతవాసుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఏర్పేడు నుండి నకిరేకల్ వరకు నాలుగులైన్ల రహదారి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ రోడ్డు పూర్తయితే వెంకటగిరి, రాపూరు, ఆత్మకూరు, కలువాయి, మర్రిపాడు, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా అటు హైదరాబాద్ పోవాలన్నా, ఇటు తిరుపతి, బెంగుళూరులకు పోవాలన్నా ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుంది. అదే సమయంలో వెంకటగిరి-నడికుడి రైలు మార్గం పనులు కూడా మొదలవుతుండడం ఈ ప్రాంత అభివృద్ధికి సంకేతంగా నిలుస్తోంది. ఈ రెండు పనులు పూర్తయితే జిల్లాలోని మెట్ట మండలాల స్వరూపం చాలావరకు మారిపోతుంది.

# జపాన్‌ను తలపిస్తున్న ఉదయగిరి!

## అభివృద్ధిలో కాదు ప్రకంపనలలో...

ఇప్పుడు ఉదయగిరి ప్రాంతం జపాన్‌ను తలపిస్తోంది. అయితే అభివృద్ధిలో అనుకునేరు... కానే కాదు. భూప్రకంపనలలో! మనం భూకంపం అన్న మాట వినగానే ముందుగా గుర్తొచ్చే పేరు జపాన్. ఈ దేశంలో భూకంపాలు ఎక్కువనే విషయం అందరికీ తెలిసిందే! అక్కడ తరచూ భూకంపాలు సంభవిస్తుంటాయి. ఇప్పుడు ఉదయగిరి ప్రాంతం కూడా అలాంటి జోన్‌లో చేరిందేమోననే అనుమానాలొస్తున్నాయి. తరచూ ఇక్కడ భూప్రకంపనలు సంభవిస్తున్నాయి. గత మూడు నెలల కాలంలోనే 9సార్లు భూప్రకంపనలు వచ్చాయి. తాజాగా ఆదివారం తెల్లవారుజామున 4.30గంటల ప్రాంతంలో భూమి కంపించింది. ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు మండలాల్లోని పలు గ్రామాల్లో భూప్రకంపనలు వచ్చాయి. మూడు, నాలుగు సెకన్ల పాటు వచ్చిన ప్రకంపనలతో పందిర్లు కదలడం, వస్తువులు కింద పడడం వంటివి జరగడంతో జనం భయంతో వీధుల్లోకి పరుగులు తీశారు. తరచూ వస్తున్న భూప్రకంపనల ధాటికి ఉదయగిరి జనం భీతిల్లుతున్నారు.

# జిల్లాలో 93 ఇంటర్ పరీక్షా కేంద్రాలు

ఇంటర్ మీడియట్ సంవత్సర పరీక్షలు మార్చి 2వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగనున్నాయి. నెల్లూరుజిల్లాలో 93పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు మొత్తం 58,075మంది విద్యార్థులు ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 30,342మంది (జనరల్ 29,017, ఒకేషనల్ 1325) ఉన్నారు. వీరిలో బాలురు 15,641 మంది బాలికలు 14,701మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 27,333మంది(జనరల్ 26,730), ఒకేషనల్ 1003) ఉన్నారు. వీరిలో బాలురు 14,802, బాలికలు 12,931 మంది ఉన్నారు. మరో వారంలో హాల్‌టికెట్లు రానున్నాయి. ఈ పరీక్షలు జంబ్లింగ్ విధానంలోనే జరుగనున్నాయి. ఈసారి 93 పరీక్షా కేంద్రాల్లో మూడు కేంద్రాలను కొత్తగా కేటాయించారు. నెల్లూరు మద్రాసుబస్టాండు వద్దనున్న సుంకు చెంగన్న నగర పాలకోన్నత పాఠశాల, ఏసి నగర్‌లోని మల్లెల సంజీవయ్య నగర పాలకోన్నత పాఠశాల, నవాబుపేటలోని పత్తివారి పాఠశాలలో కొత్త కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా వివరాలు విద్యార్థులకు తెలిసేలా www.riomellore.weebly.co వెబ్‌సైట్‌లో ఏర్పాటు చేశారు. అందులో స్కూలు కోడ్ పరీక్షా కేంద్రం చిరునామా, ప్రధానోపాధ్యాయుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచారు. ఈ ఏర్పాట్లపై ఆర్ఐవో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

# రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసిబి దాడి

- రాత్రివేళల్లో రిజిస్ట్రేషన్లు చేస్తున్న అధికారులు
- రూ.2లక్షలు స్వాధీనం

ఈమధ్యనే నెల్లూరుజిల్లా కోర్టు కాంపౌండు నుండి నెల్లూరు మద్రాసు బస్టాండు ప్రక్కనున్న జూబ్లీ ఆసుపత్రి ప్రాంగణానికి మారిన నెల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై బుధవారం రాత్రి ఏసిబి అధికారులు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో 13మంది ప్రైవేట్ వ్యక్తులు, ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్లను గుర్తించారు. వారి వద్ద నుంచి రూ. 1.92లక్షల నగదును రాత్రి 11.30గంటల సమయంలో స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయంలోని అన్ని దస్తావేజులను పరిశీలిస్తూ అర్థరాత్రి దాటిన తర్వాత కూడా తనిఖీలు కొనసాగించారు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఇటీవల అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో ఏసిబి అధికారులు ఈ దాడులకు దిగారు. ఏసిబి డైరెక్టర్ జనరల్ మాలకొండయ్య ఆదేశాల మేరకు సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ డిఎస్పీ ప్రసాద్, నెల్లూరు ఏసిబి డిఎస్పీ తోట ప్రభాకర్ ఆధ్వర్యంలో సిబిలు దాడి చేశారు. ఏసిబి అధికారులు రావడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ సిబ్బంది, బయటి వ్యక్తులు తమ వద్ద వున్న డబ్బును కిటికీల్లో నుంచి బయటపడేసారు. ఇది గమనించిన అధికారులు ఆ డబ్బును సేకరించారు. ఏసిబి అధికారులు సబ్‌రిజిస్ట్రార్లు వివి ప్రసాద్‌రెడ్డి, సయ్యద్ మహబూబ్‌బాషాలను, ప్రైవేట్ వ్యక్తులను కూర్చోమని కార్యాలయానికి తాళాలు వేశారు. ఎవరిని లోపలికి అనుమతించలేదు. ప్రైవేట్ వ్యక్తులను విడివిడిగా ఒక్కొక్కరిని ప్రశ్నించారు. ఏసిబి అధికారుల దాడుల సమయంలో జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1 ప్రసాదరెడ్డి మాత్రమే ఉన్నారు. ఆ తరువాత మరో జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2 బాషాను, ఇంటి నుంచి అధికారులు తీసుకువచ్చి ప్రశ్నించారు. ఈ దాడుల్లో ప్రకాశం, చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాల ఏసిబి డిఎస్పీలు సిబిలు వారి సిబ్బంది పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

## వైద్యకళాశాల డైరెక్టర్‌గా
# అనిల్‌కుమార్‌రెడ్డి



నెల్లూరు దర్గామిట్టలో ఉన్న ఏసి సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాల డైరెక్టర్‌గా బెజవాడ అనిల్‌కుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈమేరకు ప్రభుత్వ నియామకపు పత్రాన్ని అందజేశారు. 1982లో విఆర్ కళాశాలలో విద్యార్థి రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. జయభారత్ ఆసుపత్రి నిర్వహణలో అనుభవం ఉంది. ఈ క్రమంలో బీజేపీ కోటా క్రింద ప్రభుత్వ వైద్యకళాశాల డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది.

# మాడరన్‌లో బిగ్‌బజార్

నేటి తరం పిల్లలకు మార్కెట్, వినియోగదారులు, వస్తువుల కొనుగోళ్ళు అమ్మకాలు వంటివాటిపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో నెల్లూరు సరస్వతి నగర్‌లోని మాడరన్ స్కూల్ యాజమాన్యం ఈ నెల 21వ తేది ఆదివారం తమ స్కూలు ప్రాంగణంలో మాడరన్ బిగ్‌బజార్ పేరుతో పెద్ద షాపింగ్ కార్యక్రమమే ఏర్పాటు చేసింది. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ వన్డే షాపింగ్ మాల్ ఉండబోతుంది. అగ్గిపుల్లలు, సబ్బుబిళ్లల నుండి పండ్లు, కూరగాయలు, స్వీట్లు, పప్పులు, ఉప్పు, నూనెలు, రెడీమేడ్ గార్మెంట్స్, పట్టుచీరలు, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్, బేకరీ ఐటమ్స్, నిత్యావసర సరుకులు... ఇలా ఒకటేమిటి, రిలయన్స్ మాల్‌లోకి వెళితే మనం ఎన్ని వస్తువులను చూస్తామో, అన్ని వస్తువులు ఇక్కడ సరసమైన ధరలకు ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్కూలులో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులే కాక అందరూ వచ్చి షాపింగ్ చేయవచ్చని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్కూలు కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

# ఆత్మస్థైర్యంతోనే విజయం




విద్యార్థులు పరీక్షలంటే భయపడకుండా ఆత్మస్థైర్యంతో ముందుకెళితే విజయం సొంతమవుతుందని నగర డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. ఆదివారం రాత్రి నెల్లూరు టౌన్‌హాలులో లైఫ్‌స్కిల్స్ కోచ్, మోటివేషనల్ స్పీకర్, క్లినికల్ సైకాలజిస్ట్ నంద్ర సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఎగ్జామ్ మంత్ర-2016" అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ పరీక్షలను ఎలా ఎదుర్కోవాలి, ఒత్తిడిని ఎలా అధిగమించాలి, ఎలా తీర్చిదిద్దుకోవాలి, సులభతరంగా ఎలా సమాయత్తం కావాలి తదితర విషయాలను సుధీర్‌కుమార్ సులువుగా మెళకువలతో వివరిస్తున్న తీరు ఎంతో బాగుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాలను ఆకళింపు చేసుకుని తమ పిల్లలను గైడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసిఐ నెల్లూరుటౌన్ అధ్యక్ష కార్యదర్శులు మురళీకృష్ణ, చరణ్‌కుమార్, కోశాధికారి జనార్ధన్‌రావు, ప్రాజెక్ట్ ఛైర్మెన్ శరత్‌కుమార్, కో-ప్రాజెక్ట్ ఛైర్మెన్ పేరూరి మల్లికార్జునరావు, పివి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ-స్త్రీల సాధికారతపై చర్చ



నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం పల్లెపాడులోని పినాకిని సత్యాగ్రహ (గాంధీ) ఆశ్రమంలో ఆశ్రమ కమిటి కన్వీనర్ గణేశం కృష్ణారెడ్డి, నర్సాపురం వైయన్ కాలేజీ ప్రిన్సిపల్ డా॥ డి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వరుసగా 3వ నెల గాంధీ గారి అధ్యయన తరగతులు జరుగుతున్నాయి. ఈ నెల 13వ తేదీ గాంధీజీ-స్త్రీల సాధికారత అనే అంశంపై ఆశ్రమ ప్రచార మహిళా కార్యకర్త గూడూరు లక్ష్మి మాట్లాడుతూ పురుషులకు లేని నిర్బంధాలు స్త్రీలకు ఉండరాదని, కూతుళ్ళను కొడుకులను సమాన స్థాయిలో చూస్తానని గాంధీ గారు అన్న సూచనలను వివరించారు. ఈ కార్యక్రమంలో తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, డైట్ కాలేజీ విద్యార్థినీ విద్యార్థులు, వివేకానంద డిగ్రీకాలేజీ కరస్పాండెంట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, డైట్ కాలేజీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై సదస్సు

నెల్లూరుజిల్లా కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ కాలేజీలో 13వ తేదీ ఐఇఇఇ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై రెండురోజుల సదస్సు జరిగింది. ఈ సదస్సులో బెంచ్ మార్కు ఎలక్ట్రానిక్స్ అసిస్టెంట్ మేనేజర్ శివకుమార్ మాట్లాడుతూ వైద్య, యాంత్రీకరణ, వాతావరణ విభాగాల్లో సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కంప్యూటర్‌తో అనుసంధానం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కళాశాల సంచాలకులు డాక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల వల్ల విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలుగుతుందన్నారు. తద్వారా ఉపాధి అవకాశాలు పొందే వీలుందన్నారు. ఐఇఇఇ విభాగాధిపతి డాక్టర్ నాగిరెడ్డి మాట్లాడుతూ రెండురోజుల సదస్సులో విద్యార్థులకు సాంకేతిక పత్రాల ప్రదర్శన, ప్రాజెక్ట్ ప్రదర్శన, క్విజ్ పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఈసిఇ విభాగాధిపతి హరనాథరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



# అందాలు చిందే.. జ్యూట్ బ్యాగ్స్



- ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా నాణ్యమైన ఉత్పత్తులు
- పర్యావరణాన్ని కాపాడే సరికొత్త బ్యాగ్‌లు

*'ప్లాస్టిక్ వద్దు..జ్యూట్‌బ్యాగే ముద్దు' అనే నినాదంతో, సమాజంలో నానాటికీ పెరిగిపోతున్న కాలుష్యాన్ని దూరం చేసేందుకు, తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు జనపనార (జ్యూట్)తో తయారుచేసిన బ్యాగ్‌లు ఇప్పుడు వినియోగదారులను బాగా ఆకట్టుకుంటున్నాయి. పర్యావరణం కాపాడాలనే సామాజిక స్పృహ వున్నవారితో పాటు, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్ధాలను తెలుసుకున్నవారంతా ఈ బ్యాగ్‌ల పట్ల ఎక్కువ మక్కువ చూపుతున్నారు. నెల్లూరు నగరంలోని డికెడబ్ల్యు కళాశాల విశ్రాంత అధ్యాపకురాలు శ్రీమతి కుసుమకుమారి ఈ బ్యాగ్‌ల తయారీకి రూపకల్పన చేసి, వీటి తయారీలో ఎంతోమంది మహిళలకు శిక్షణ ఇస్తూ, తద్వారా పర్యావరణాన్ని కాపాడేందుకు తనవంతు చేయూతనందిస్తున్నారు. గతంలో ఈమె పొదుపులక్ష్మి, డిఆర్‌డిఏ డ్వాక్రా విభాగంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా కూడా పనిచేసివున్నారు. సమాజానికి తనవంతు సేవలందించాలనే తపనతో, తాము పర్యావరణాన్ని కాపాడేందుకు బాగా దోహదం చేసే జ్యూట్‌బ్యాగ్స్ తయారీకి, శిక్షణకు సంకల్పించామన్నారు.*

మనం నిత్యం ఎన్నో రకాల ప్లాస్టిక్ బ్యాగ్‌లు వాడుతుంటాం. అయితే, అవి ప్లాస్టిక్‌తో తయారైనవి కావడం వల్ల, వాటిని ఆ తర్వాత పారేసినా అవి భూమిలో కలసిపోక ఏళ్ళ తరబడి అలాగే వుండిపోయి పర్యావరణానికి ఎంతో ఇబ్బంది కలుగ జేస్తుంటాయి. అదే జనపనారతో తయారుచేసిన బ్యాగ్‌లైతే, వాటిని కొంతకాలం వినియోగించుకుని పారేసినా, అవి భూమిలో కలసిపోతాయి కనుక ఎలాంటి ఇబ్బందీ వుండదు. అందుకే, పర్యావరణాన్ని కాపాడే ఈ బ్యాగ్‌లను విస్తృతంగా తయారుచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నదే తమ లక్ష్యమని శ్రీమతి కుసుమకుమారి చెప్తున్నారు. నెల్లూరు డికెడబ్ల్యు కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేసిన ఆమె, రిటైరయ్యాక కూడా విశ్రాంతి అన్నది లేకుండా సమాజ శ్రేయస్సుకోసం తనవంతు సేవలందిస్తున్నారు. పర్యావరణం దెబ్బతింటే వాతావరణంలో భారీ మార్పులు వస్తాయని, అధికవేడిమి వాతావరణం ఏర్పడేందుకు ఈ పర్యావరణ అసమతుల్యతే కారణమని ఆమె అంటున్నారు. ప్లాస్టిక్ వ్యర్ధాలను తెలియక తినేసే పశువులు, తదితర జంతువులు తీవ్రమైన అనారోగ్యానికి గురై మృత్యువాత పడుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మనం అన్నం తినేటప్పుడు గతంలో అరటి ఆకులనో, లేదా బాదం ఆకులు, మర్రిఆకుల విస్తర్లనో వాడేవారమని, ఇప్పుడంతా ఆధునికత పేరుతో ప్లాస్టిక్ పేపర్లు, ప్లాస్టిక్ గ్లాస్‌లు వినియోగిస్తున్నామని, అయితే వీటివల్ల పర్యావరణానికి ఎంతో నష్టం కలుగుతోందన్నారు. అందువల్ల పర్యావరణ పరిరక్షణకు దోహదం చేసే జనపనార బ్యాగ్‌లను వినియోగించుకోవడం శ్రేయస్కరమైన మార్గమని ఆమె స్పష్టం చేశారు. గ్లోబల్‌వార్మింగ్‌తో ప్రపంచం సతమతమవుతోందని, వాతావరణ అసమతౌల్యత వల్ల కలిగే అనర్ధాలను నివారించేందుకు అందరూ కృషి చేయాలని అంటూ, అందుకు పర్యావరణానికి ఇబ్బంది కలిగించే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఈ జ్యూట్‌బ్యాగ్స్ వినియోగం ఆ సమస్యకు ఒక సమాధానంగా అందరికీ ఉపయోగపడతాయన్నారు.

## నాణ్యతలో మేటి.. మన్నికలో వీటికివే సాటి :



జనపనారతో తయారయ్యే రకరకాల ఉత్పత్తులతో ప్రజలకు ఎన్నో ఉపయోగాలున్నాయని కుసుమకుమారి ఈ సందర్భంగా తెలియజేశారు. జనపనార తాళ్ళు, కంబళ్ళు, గోనెసంచులు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఇప్పుడు అదే జనప నారతో రకరకాల బ్యాగ్‌లు, పౌచ్‌లు, అన్నిరకాల వస్తువులను వుంచుకునేందుకు ఉపయోగపడే బ్యాగ్‌లు అందుబాటులోకి తెచ్చామన్నారు. వీటిధర రూ.10 నుంచి వెయ్యి రూపాయల దాకా వుంటుందని, పలు రకాల సైజ్‌లతో, మంచి డిజైన్లతో ఎంతో అందంగా రూపొందిస్తున్న ఈ బ్యాగ్స్ వివాహాది శుభకార్యాలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గిఫ్ట్‌బ్యాగ్‌లను కూడా ఎంతో అందంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. సమాజానికెంతో ఉపయోగకరమైన ఈ శిక్షణాకేంద్రాన్ని ఒక ఉత్పత్తికేంద్రంగా ఏర్పాటయ్యేందుకు అవసరమైన సబ్సిడీరుణం అందజేసి సహకరించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి సుధాకర్‌కు, తమనెంతో ప్రోత్సహిస్తున్న అలిప్ సంస్థవారికి, ఇక్కడ శిక్షణ పొంది అందరికీ శిక్షణ ఇస్తున్న ఎం.కల్యాణికి, ఈ ఉత్పత్తులను కొనుగోలుచేసి సహకరిస్తున్నవారందరికీ ఆమె ఈ సందర్భంగా తన కృతజ్ఞతాభివందనలు తెలిపారు. జ్యూట్‌బ్యాగ్స్ తయారీలోనూ, టైలరింగ్‌లోనూ ఇక్కడ మహిళలకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ బ్యాగ్‌ల తయారీకి నెల్లూరు నగరంలోని ఎ.కె నగర్ పోస్టల్‌కాలనీ, 6వ వీధిలో వున్న కుట్టి ఇన్‌ఫోటెక్ (ఫోన్ నెం. 9248658193) లో మహిళలకు రెండునెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నామని, వివరాలకు తమను సంప్రదించవచ్చని కోరారు. ఏదేమైనా, ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్ధాలను దృష్టిలో పెట్టుకుని, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఎంతో దోహదం చేసే ఈ జ్యూట్‌బ్యాగ్‌ల వినియోగాన్ని ప్రజలంతా ప్రోత్సహించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# వైకాపాకు 'విజయ'ం



ఆనం సోదరులలో నాలుగో బ్రదర్, నెల్లూరురూరల్ నియోజకవర్గంలో గట్టి నాయకుడైన ఆనం విజయకుమార్‌రెడ్డి ఈ నెల 17వ తేదీన వైకాపా అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరాడు. దీంతో నలుగురు ఆనం సోదరుల రాజకీయ భవిష్యత్‌పై క్లారిటీ వచ్చినట్లయ్యింది. ఆనం వివేకానందరెడ్డి, రామనారాయణ రెడ్డిలు ఇటీవలే కాంగ్రెస్ నుండి తెలుగుదేశంలో చేరడం తెలిసిందే! మూడో బ్రదరైన ఆనం జయకుమార్‌రెడ్డి 2014 ఎన్నికల తర్వాత వీరికంటే ముందుగా తెలుగుదేశంలో చేరారు. మొన్న తన సోదరులతో విభేదించిన విజయకుమార్‌రెడ్డి వారితో పాటు తెలుగుదేశంలోకి పోలేదు. ఆయన ఆలోచనలను పసిగట్టిన వైకాపా జిల్లా నాయకులు ఆయనింటికి వెళ్లి వైకాపాలోకి రావాలని కోరారు. దీంతో ఆయన ఆలోచన కూడా అదే కావడంతో అనుచరులతో మాట్లాడుకుని తన అంగీకారం తెలిపారు. ఆనం విజయను పార్టీలో చేర్చడంలో నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కీలకపాత్ర పోషించారు. రాజకీయ కోణంలో ఆలోచిస్తే ఒక రాజకీయ కుటుంబం నుండి వస్తున్న నాయకుడిని స్థానికంగా ఉండే ఎమ్మెల్యే అడ్డుకుంటాడు. ఎందుకంటే భవిష్యత్‌లో అతని నుండి తనకు నష్టం ఉంటుందని. అదీగాక నెల్లూరు రూరల్‌లో గట్టి నాయకుడు ఆనం విజయకుమార్‌రెడ్డి.

కాని అతనిని కోటంరెడ్డి మనస్ఫూర్తిగా పార్టీలోకి ఆహ్వానించాడు. దానికి కారణం లేక పోలేదు. రాజకీయాల్లో ఉన్నా నమ్మదగిన వ్యక్తి విజయ. ముక్కుసూటిగా మాట్లాడడం అతని నైజం. వెన్నుపోట్లు తెలియవు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి అన్నలా అండగా నిలబడతానని చెప్పాడు. ఆ నమ్మకంతోనే కోటంరెడ్డి కూడా ఒక తమ్ముడిలా వ్యవహరించి ఆయనను పార్టీలో చేర్పించాడు. ఆయనతో పాటు ముఖ్యఅనుచరులు కూడా వైకాపాలో చేరడం జరిగింది.

# పెరిక బలిజలకు బి.సి సర్టిఫికేట్లివ్వండి



జిల్లాలో పెరిక బలిజల కులస్థులకు బి.సి. సర్టిఫికేట్లు ఇవ్వాలని కోరుతూ నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జిల్లా రెవెన్యూ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. పెరిక బలిజలకు బి.సి సర్టిఫికేట్లు ఇవ్వడంలేదని 'లాయర్'లో వచ్చిన వార్తకు ఆయన స్పందించారు. ఆ కులస్థుల తరఫున ఆయన సర్టిఫికేట్ల విషయమై రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. చిత్తూరు, కడప, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పెరిక బలిజ కులస్థులకు బి.సి–బి క్రింద సర్టిఫికేట్లు మంజూరు చేస్తున్నారని, మన జిల్లాలో మాత్రం ఎందుకివ్వడం లేదని అడిగారు. బి.సి సర్టిఫికేట్లు లేక ఆ కులం విద్యార్థులు మంచి భవిష్యత్‌ను కోల్పోతున్నారని ఆవేదన చెందారు. ఈ విషయమై సీఎం చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, జిల్లా మంత్రి పి.నారాయణలకు కూడా లేఖలు వ్రాస్తానని ఆయన పేర్కొన్నారు.










# 'ప్రభా'తం

ఒక్కోసారి దేశాన్ని కుదిపేస్తున్న కొన్ని సంఘటనలను పరిశీలిస్తే.. అసలు మనం ఎటు పోతున్నామో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడుతుంది. ఏది తప్పో, ఏది ముప్పో.. ఏది ఎంతవరకు అవసరమో.. ఏది అనవసరమో.. ఇంకా తెలియని స్థితిలోనే వున్నామా ఆవేదన అందరిలోనూ కలుగుతోంది. దేశవ్యాప్తంగా రోజూ ఏదో ఒక సంచలనమే ధ్యేయంగా, ఇష్టారాజ్యంగా జరుగుతున్న కొన్ని సంఘటనలు సామాన్య ప్రజలను సైతం మరింత కలవరానికి గురిచేస్తున్నాయి. దేశంలో ఇప్పటికే పేరుకుపోయి వున్న సమస్యలను తీర్చుకోలేకపోగా, మరిన్ని సమస్యలను తెచ్చిపెట్టుకుని ప్రశాంతతను అశాంతిగా మార్చుకుంటున్నామేమోననే ఆందోళన కలుగుతోంది. సమస్యలు పోయేందుకు కృషిచేయాల్సిన కొందరు నాయకులు కూడా సమస్యలను మరింత జటిలంగా మారుస్తుండడం, తద్వారా దేశప్రగతికి అవరోధం కలిగేవిధంగా వ్యవహరిస్తుండడం అందరికీ వేదన కలిగిస్తోంది. రోజుకో సంచలనం అన్నట్లుగా దేశంలో జరుగుతున్న ఘటనలు చూస్తుంటే, ఇవన్నీ కూడా బహుశా రాజకీయాల్లో భాగమే కాబోలని అనుకోవాల్సివస్తోంది. గతంలోవున్న పరిస్థితి నుంచి దేశం కొంత మెరుగైన దిశలోకి నడుస్తోందనుకుంటున్న దశలో, ఎక్కడోఒకచోట జరిగే ఘటనలు అందరికీ బాధను కలిగిస్తున్నాయి. అసలు మన దేశాన్నీ, జాతినే కాక, మొత్తంగా ప్రపంచాన్నే భయపెడుతున్న అతిపెద్ద సమస్యలను వదిలేసి, ఇలా లేనిపోని ఆందోళనల రొంపులతో రచ్చకెక్కడం సమంజసమేనా..? అసలు ఉగ్రవాదం-వాతావరణ కాలుష్యమనే రెండు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వున్న అతిపెద్ద సమస్యలు. వీటిలో భయంకరమైన సమస్య ఉగ్రవాదమే. ఉగ్రవాదంపై సమిష్టి పోరుకు సమాయత్తం కావాలని ప్రపంచానికి పిలుపునిచ్చిన మన దేశంలోనే ఉగ్రవాదుల ఆటలు సాగడం ఎంతవరకు శ్రేయస్కరం?.. పవిత్రమైన, ప్రశాంతమైన మన దేశంలోనూ ఉగ్రవాదుల అరాచకాలకు ఊతమివ్వడం ఏమి మానవత్వం?.. ఉగ్రవాదం ఎంత భయంకరమైనదో అందరికీ తెలిసిందే. ప్రపంచంలో ఎక్కడో ఒకచోట నిత్యం ఏదో ఒక పైశాచిక రూపంలో అది అందరికీ కనపడుతూనే వుంది. అయితే, అది ఏ దేశంలో ఎప్పుడు ఎవరిమీద పడి ఎంతటి కిరాతకానికి పాల్పడుతుందో, ఎందరిని నిర్దాక్షిణ్యంగా ఊచకోత కోస్తుందో, ఎంతమంది అమాయకులను అమానుషంగా పొట్టనబెట్టుకుంటుందో, ఎప్పుడు ఎలాంటి దౌష్ట్యాలకు పాల్పడుతుందో మాత్రం చెప్పలేని పరిస్థితి. ఈ ఉగ్రవాదం దెబ్బకి ప్రపంచం యావత్తూ కంటిమీద కునుకు లేకుండా వుంటే, మరోవైపు ఎంతో ప్రశాంతంగా వున్న మనదేశంలోనూ కొంతమందివ్యక్తులు ఉగ్రవాదులకు ఏదోఒక విధంగా మద్దతుగా వ్యవహరిస్తుండడం ఎంత దారుణం?... ఎక్కడెక్కడినుంచో అక్రమమార్గాల్లో మనదేశంలోకి జొరబడి, గుంటనక్కల్లా పొంచివుండి, అదును చూసుకుని మనదేశంలోని ప్రజలపై భయంకర దాడులుచేస్తూ, ఎంతోమందిని హతమారుస్తున్నా కూడా స్పందించని వీరు, అలాంటి ఉగ్రవాద రాక్షసమూకలకు మాత్రం ఏదోవిధంగా మద్దతుగా వ్యవహరిస్తున్నారంటే ఏమనుకోవాలి?..ఇదేనా మన జాతీయత?..ఇదేనా మన దేశభక్తి?.. ఉగ్రవాద విషసర్పాలకు పాలుపోసి పెంచి మనదేశానికి పంపి, మన ప్రజలను కాటేసే కుయుక్తులతో వున్న పాక్‌ను కూడా వదలకుండా పడగవిప్పి కాటేసే భయంకర ఉగ్రవాద విషసర్పాల దౌష్ట్యాలు కళ్ళకు కనిపించడం లేదా?..ఉగ్రదాడులకు బలైపోయినవారి కుటుంబాలవారు పడే వేదనలు, పిల్లలు పాపలతో సహా బిగ్గరగా రోదిస్తున్న బాధిత కుటుంబాల రోదనలు చెవులకు వినిపించడం లేదా?...ఇటీవల పఠాన్‌కోటలో ఉగ్రవాదులు జరిపిన దాడులు..భీభత్సం కూడా గుర్తుకురాలేదా?. .ఇదేనా మన మాతృదేశ భక్తి?..ఇదేనా మన దేశానికి మనమిచ్చే గౌరవం?.. భయంకరమైన ఉగ్రవాది సయీద్ ఇక్కడి ఆందోళనలకు మద్దతునిస్తూ..మనదేశ ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడంలాంటి ఘటనలు దేశసమగ్రతపై, దేశభద్రతపై మోగుతున్న ప్రమాద ఘంటికలు కావా?..ఢిల్లీలోని జెఎన్‌యులో ఆందోళన చేస్తున్న విద్యార్థులకు సయీద్ మద్దతు ప్రకటించడమంటే మనదేశ ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం కాదా?.. పార్లమెంట్‌పై దాడి కేసులో ఉరిశిక్షకు గురైన అఫ్జల్‌గురు వర్ధంతికి ఆ యూనివర్శిటీలో కొందరు ర్యాలీ నిర్వహించడం, ఉరిశిక్షలకు వ్యతిరేకంగా నిరసనలు తెలపడం, ఇక్కడ చేస్తున్న ఆందోళనలకు సయీద్ మద్దతు ప్రకటించడమేమిటనే ఆందోళన ప్రజల్లో సర్వత్రా వెల్లడవుతోంది. ఈ మద్దతుకు అంతరార్థమేమిటి?..పాక్‌లో తలదాచుకుంటూ మనదేశంలో ఉగ్రవాద కార్యకలాపాలను పెంచిపోషిస్తున్న ఉగ్రవాదులను నిరోధించేందుకు కంకణం కట్టుకోవాల్సిందిపోయి, మన దేశాన్నే కాటువేయాలని కాచుక్కూచున్న ఉగ్రవాదులకు ఇక్కడివారే కొందరు వత్తాసుగా వ్యవహరించడాన్ని ఏమనుకోవాలి?.. ఇలాంటి ఘటనలు దేశ సమగ్రతకు- దేశ సార్వభౌమత్వానికే ముప్పు కాదా?.. అసలు, మనదేశ ఆంతరంగిక వ్యవహారాల్లో ఉగ్రవాదులు జోక్యం చేసుకోవడం ఏమిటి?.. దేశభద్రత దృష్ట్యా ఇలాంటి వాటిని తక్షణం నిరోధించకపోతే దేశపరిస్థితి ఏమిటి?..ప్రతి విషయాన్నీ రాజకీయంగా లబ్ధిపొందడానికి రాజకీయం చేసే మన రాజకీయనాయకులు కొందరు ఇలాంటి ప్రమాదకర విషయాలను కూడా రాజకీయదృష్టితోనే చూస్తుండడం మరింత దారుణం. భారతదేశ సమగ్రతకు ముప్పువాటిల్లజేసే ఉగ్రవాద రక్కసిమూకల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకుంటే చివరికి దేశం పరిస్థితి ఏమవుతుందోననే ఆందోళన ప్రజల్లో సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇకనైనా దేశంలోని అన్ని రాజకీయపార్టీలు, రాజనీతిజ్ఞులు, అనుభవజ్ఞులు, మేధావులు అందరూ కలసి ఇలాంటి సంఘటనలను రాజకీయంగా కాక, దేశభద్రత, దేశ సమగ్రత, దేశ సార్వభౌమాధికారం కోణాలనుంచి పరిశీలించి తగు నిర్ణయాలు తీసుకోవాల్సివుంది. ముఖ్యంగా, దేశభద్రతను దృష్టిలో పెట్టుకుని కేంద్రప్రభుత్వం ఇలాంటి ఘటనలను పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాల్సి వుంది.

## ఎటు పోతున్నాం మనం?..



పాక్‌లో వుంటూ మనదేశంలో ఉగ్రవాద కార్యక్రమాలు చేపడుతున్న ఉగ్రవాదులను నిరోధించేందుకు కంకణం కట్టుకోవాల్సిందిపోయి, మనదేశాన్నే కాటువేయాలని కాచుక్కూచున్న ఉగ్రవాదులకు ఇక్కడివారే కొందరు వత్తాసుగా వ్యవహరిస్తుండడం దారుణం. ఇదేనా మన దేశభక్తి?.. ఇదేనా మన జాతీయత?.. అసలు, మనదేశ ఆంతరంగిక వ్యవహారాల్లో సయీద్ వంటి ఉగ్రవాదులు జోక్యం చేసుకోవడమేమిటి?.. ఇలాంటి ఘటనలు దేశ భద్రతకు ముప్పు కాదా?.. అందరూ ఆలోచించాల్సిన విషయాలివి!

# ఆధ్యాత్మిక సాధన పదయాత్ర




ఆరోగ్యంతో పాటు ధార్మిక చింతనను కలిగిస్తూ శ్రీ వెంకయ్యస్వామి పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు నుంచి గొలగమూడికి నిర్వహించిన సాధన పదయాత్రకు విశేషస్పందన లభించింది. ప్రతిఒక్కరూ అందరి కోసం, అందరూ ప్రతి ఒక్కరి కోసం అంటూ సాయి నామస్మరణతో నెల్లూరు చిల్డ్రన్స్ పార్కు సమీపంలోని శ్రీ షిరిడి సాయిసదన్ నుంచి పదయాత్ర ప్రారంభమైంది. ఈ యాత్రలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారితో పాటు విదేశీయులు పాల్గొన్నట్లు నిర్వాహకులు అల్లు భాస్కరరెడ్డి తెలిపారు.

# విలేకరి వైద్యానికి ఆర్థిక సాయం

కేన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్సపొందుతున్న విలేకరి సిద్ధంశెట్టి నరసింహారావుకు వైద్యానికి సాయం అందిస్తూ పలువురు ఆయనకు తమవంతు చేయూతనందించారు. నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 13న జరిగిన కార్యక్రమంలో ఆ మేరకు ఆయన తండ్రి పెంచలయ్యకు 32వేల రూపాయలను సాయంగా అందజేశారు. ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, ప్రెస్‌క్లబ్ ఇన్‌ఛార్జి రాజన్, ది జర్నలిస్ట్ హౌస్‌బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు జయరాజ్ ఆ నగదును అందజేశారు. జర్నలిస్ట్ నరసింహారావు పిల్లల చదువుకయ్యే ఖర్చును తాను భరిస్తానని తోట నాగరాజు ఈ సందర్భంగా ప్రకటించగా, హెల్పింగ్ హ్యాండ్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి రూ. 5వేలను అందజేశారు. ప్రెస్‌క్లబ్ ద్వారా రాజన్ రూ. 10వేలను, సామంతు గోపాలరెడ్డి రూ. 3వేలు, సీనియర్ జర్నలిస్ట్ నారాయణరావు 2వేలు, మరో జర్నలిస్ట్ 5వేలు అందజేశారు. నరసింహారావుకు సాయం చేయాలని భావించేవారు ఆయన ఫోన్ నెంబర్ 9989576837కు సంప్రదించాలని వారు సూచించారు.

# ఆర్టీసీ డైరీ

ఆర్టీసీ సూపర్ వైజర్ల సంఘం రూపొందించిన నూతన డైరీని 14వ తేదీన ఆర్టీసీ మెయిన్ బస్టాండ్‌లో ఆర్‌ఎం జి.మహేశ్వర ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిటిఎం సత్యనారాయణ, నెల్లూరు 1, 2 డిపో మేనేజర్లు శీనయ్య, మురళీకృష్ణ, ఆర్టీసీ సూపర్‌వైజర్ల సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్, రీజనల్ కార్యదర్శి సునీల్‌కుమార్‌తో పాటు సంఘం సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

# సియాచిన్ అమరవీరులకు నివాళి

సియాచిన్‌లో విధులు నిర్వహిస్తూ అక్కడ మంచుకొండలు విరిగిపడడంతో మృతి చెందిన భారత సైనికులకు నివాళులర్పిస్తూ, ఆ అమరవీరులకు నెల్లూరులో కర్పూర హారతులర్పించారు. సియాచిన్ అమరవీరులకు నివాళులర్పిస్తూ ఈ నెల 13న విహెచ్‌పి నేతలు మోహన్‌రావు, డాక్టర్ విజయలక్ష్మి, రాజేంద్రప్రసాద్, జగదీష్, చంద్రశేఖర్, బిజెపి నాయకులు మిడతల రమేష్ తదితరుల ఆధ్వర్యంలో నెల్లూరులో కార్యక్రమం నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలొదిలిన అమర జవాన్ల త్యాగాన్ని కొనియాడారు. దురదృష్టవశాత్తూ మంచు చరియలు విరిగిపడి పదిమంది వీరసైనికులు మరణించడం ఎంతో బాధాకరమని వారు ఈ సందర్భంగా బాధను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏబివిపి నాయకుడు వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సియాచిన్‌లో వదలాలి!

పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులకు మద్దతు పలుకుతూ భారత వ్యతిరేక నినాదాలు చేసిన జెఎన్‌యూ విద్యార్థి వెధవలను సియాచిన్ మంచు పర్వతాల్లో వదలాలి. వీళ్లను జైళ్లలో పెట్టేకంటే అక్కడ వదలడమే కరెక్ట్. దేశం కోశం మన సైనికులు పడుతున్న కష్టాలను వీళ్లకు చూపించాలి. మన జవానులకు ఈ వెధవలను కనీసం ఓ ఐదేళ్లపాటన్నా సేవకులుగా పెట్టాలి. అప్పుడన్నా ఈ దేశద్రోహులలో మార్పు వస్తుందేమో!

**– సి.రాజీవి, నెల్లూరు.**




## హాఫ్ ఇండియన్

రాహుల్‌గాంధీ సగం మాత్రమే ఇండియన్. సగం ఇటాలియన్. కాబట్టే అతనిలో సగం భారతీయుడు, సగం విదేశీయుడు కనిపిస్తాడు. అతను విదేశీ అమ్మాయిల వ్యామోహంలో పడతాడు. ఉగ్రవాదుల మద్దతుదారులకు ఇతను మద్దతు పలకడం చూస్తుంటే దేశ సమగ్రత, దేశ రక్షణ పట్ల ఇతగాడికి ఎంతమాత్రం బాధ్యత ఉందో అర్థమవుతోంది. ఇలాంటి వాడిని ప్రధానిని చేస్తే దేశాన్ని ఉగ్రవాదులు చెరబట్టడం ఖాయం.

**చింతా నరేంద్ర, హైదరాబాద్.**

## ఏపిపై దృష్టి పెట్టండి

గ్రేటర్ ఎన్నికల ఫలితాలు చూసైనా చంద్రబాబు హైదరాబాద్ వ్యామోహం వదులుకోవాలి. సీమాంధ్ర సెటిలర్స్ చంద్రబాబును ఛీకొట్టారు. ఇక తెలంగాణలో పార్టీ అవసరమా? ఇంతకాలం అమరావతి రాజధాని అంటూ రెండేళ్లు ఏమీ చేయకుండా సాగదీశారు. రాజధానిని పక్కనపెట్టి మిగతా విషయాలను పట్టించుకోండి. అభివృద్ధిలో అన్ని జిల్లాలు వెనుకబడి వున్నాయి. అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనుండన్నా ఏపిపై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టండి.

**డి.కరుణాకర్, శ్రీకాళహస్తి.**

# పట్టాలెక్కుతున్న ప్రగతి

- జిల్లాలో రైల్వేకు మహర్దశ
- కొత్త బడ్జెట్‌పై కోటి ఆశలు



**నెల్లూరుజిల్లాలో రైల్వే ప్రగతిపై ఆశలు చిగురిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కూడా రైల్వే పరంగా అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తుండడంతో జిల్లాలో రైల్వే ప్రగతిపై ఆశలు చిగురిస్తున్నాయి.**

దక్షిణ మధ్య రైల్వే డివిజన్ పరిధిలో ఇప్పుడు నెల్లూరు జిల్లా కీలకంగా వుంది. దీనికి కారణం కృష్ణపట్నం పోర్టు రైల్వే లైన్. ఈ లైన్ వచ్చాకే దక్షిణ మధ్య రైల్వే ఆదాయంలో అగ్రస్థానంలో నిలవ సాగింది. పోర్టు మూలంగా రైల్వేకు అనూహ్యంగా ఆదాయం పెరిగింది. అయితే కృష్ణపట్నంపోర్టు నుండి వెంకటాచలం వరకు మాత్రమే లైన్ పూర్తయ్యింది. ఈ పోర్టు లైన్‌ను ఇంతవరకు చెన్నై-విజయవాడ లైన్‌కు మాత్రమే అనుసంధానం చేసివున్నారు.

కృష్ణపట్నం పోర్టు నుండి ఓబులాపురంకు ప్రధానమైన లైన్ పూర్తి చేయాలి. వెంకటాచలం నుండి ఓబులాపురం మధ్య రైల్వే మార్గం పనులు జరుగుతున్నాయి. ఈ లైన్ పూర్తయితే పోర్టు ద్వారా ఎగుమతులు, దిగుమతులు మరింత వేగమందుకుంటాయి. ఓబులాపురం లైన్ పూర్తయితే అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలతో పాటు కర్నాటక, మహారాష్ట్రలకు కూడా పోర్టు నుండి లావాదేవీలు మొదలై రైల్వే ఆదాయం పెరిగే అవకాశముంది. ప్రస్తుతం ఈ రైల్వే లైన్ పనులు చురుగ్గానే సాగుతున్నాయి. రేపు ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో కూడా ఈ మార్గానికి పెద్దపీట వేసి తొందరగా పూర్తి చేస్తారని ఆశించవచ్చు. ఇక మెట్టవాసుల మూడుదశాబ్దాల కల నడికుడి-వెంకటగిరి రైలు మార్గం. 30ఏళ్లుగా ఈ లైన్‌పై సర్వేలు జరిగాయి. ఏ ప్రభుత్వంలో కూడా ఆచరణ కొచ్చిందిలేదు. కాని ఇప్పటి ప్రభుత్వంలో ఈ మార్గం వస్తుందనే ఆశలు కలుగుతున్నాయి. వెంకటగిరి-నడికుడి రైలు మార్గానికి సర్వే, కావాల్సిన భూసేకరణ పనులు జోరుగా జరగడం చూస్తుంటే ఖచ్చితంగా ఒకట్రెండేళ్లలోనే మనం ఇక్కడ రైలు కూతను వినగలమనే నమ్మకం కలుగుతోంది. జిల్లాలో వెంకటగిరి, రాపూరు, పొదలకూరు, కలువాయి, ఆత్మకూరు, వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల మీదుగా ఈ రైల్వేలైన్ పోతోంది. ఈ మార్గాలలో ఎక్కడెక్కడ స్టేషన్లు వస్తాయో కూడా గుర్తించారు. ఈ రైలు మార్గం పూర్తయితే ఈ మండలాలన్నింటికీ ఉపయోగమే. అదీగాక తుఫాన్‌లు, వరదల సమయంలో చెన్నై, విజయవాడ లైన్‌కు ప్రత్యామ్నాయంగా కూడా ఈ మార్గం ఉపయోగపడుతుంది. ఇన్ని ప్రయోజనాలున్న ఈ రైల్వేలైన్‌కు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత వుంటుందని ఆశించవచ్చు. ఇక గతంలో గూడూరు-దుగరాజపట్నం రైల్వేలైన్‌ను మంజూరు చేసి వున్నారు. ఈ లైన్‌పై కూడా ఆలోచించాల్సి వుంది. జిల్లాలో కృష్ణపట్నం పోర్టుతో పాటు శ్రీసిటీ, మేనకూరు, మాంబట్టు సెజ్‌లు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ సెజ్‌ల పరిధిలోకి విస్తృతంగా పరిశ్రమలు వస్తున్నాయి. వీటి ద్వారా రైల్వే రవాణా పెరిగే అవకాశముంది. కొత్త రైలు మార్గాలు ఏర్పడి రైల్వేకు ఈ జిల్లా నుండి ఇంకా భారీగా ఆదాయం పెరిగే అవకాశముంది. జిల్లా రైల్వే ప్రయోజనాలపై మన కేంద్రమంత్రి వెంకయ్య ప్రత్యేక దృష్టి పెట్టి సాధించాల్సి వుంది.

# ఆనంపై పెద్ద బాధ్యత



**చంద్రబాబుకు ఎవరిని ఏ సమయంలో ఎలా వాడుకోవాలో తెలుసు. కాబట్టే అన్ని పార్టీల నుండి నాయకులను తన పార్టీలోకి లాగేసుకుంటున్నాడు. ఆనం సోదరులను కూడా ఆయన ఆ ఆలోచనతోనే పార్టీలోకి తీసుకున్నాడు. ఆనం సోదరులను తెలుగు దేశంలోకి తీసుకోవడంలో మంత్రి నారాయణ ప్రోద్బలం కూడా ఉందన్నది వాస్తవం.**

అయితే కేవలం నెల్లూరుజిల్లా రాజకీయాలను మాత్రమే దృష్టిలో పెట్టుకుని ఆనం బ్రదర్స్‌ను తెలుగుదేశంలోకి తీసుకోలేదు. ముఖ్యంగా ఆనం రామనారాయణరెడ్డి సీనియార్టీని రాష్ట్ర స్థాయిలో వాడుకోవాలనుకుంటున్నట్లు తెలుస్తోంది.

2014లో చంద్రబాబుకు అధికారం దక్కిందంటే అది కాంగ్రెస్ కేడర్ పుణ్యమే. ఒకరకంగా మనసులో ఆయన జగన్‌కు కృతజ్ఞతలు కూడా చెప్పుకోవచ్చు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ కేడర్ అంతా కూడా జగన్ వైపు చూసింది. మీరు గేట్లు తీస్తే లోపలకు వస్తామని కాంగ్రెస్ నాయకులు వేడుకున్నారు. ఇక్కడ సీట్లు ఖాళీగా లేవు, మీరు మాకు అవసరం లేదంటూ జగన్ తన పార్టీ కార్యాలయం బయట హౌస్‌ఫుల్ బోర్డు తగిలించాడు. దీంతో కాంగ్రెస్ కేడర్ చాలావరకు తెలుగుదేశంపార్టీలో చేరి పోయింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ కేడర్ తెలుగుదేశంకు బలమైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇంకా పూర్తిగా నిర్వీర్యం కాలేదు. కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, వట్టి వసంతకుమార్, దేవినేని నెహ్రూ, మానుగుంట మహీధర్‌రెడ్డి, గాదె వెంకటరెడ్డి వంటి గట్టి నాయకులు కాంగ్రెస్‌లో ఇంకా కొంతమంది ఉన్నారు. వీరందరితో సన్నిహిత సంబంధాలు కలిగిన నాయకుడు ఆనం రామనారాయణరెడ్డి. అదీగాక రాజకీయంగానూ, పరిపాలనలోనూ అనుభవమున్నోడు. అరకొర మిగిలివున్న కాంగ్రెస్ కేడర్‌ను వైకాపా వైపుకు పోకుండా తెలుగుదేశం వైపుకు లాగాలని చంద్రబాబు ఆలోచన. దానికి రామనారాయణరెడ్డిని బాగా వాడుకోవాలని చంద్రబాబు, నారాయణలు ఫిక్సయినట్లు తెలుస్తోంది.

# కృతజ్ఞత చాటుకున్న కమిషనర్



నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టాక వెంకటేశ్వర్లు చేసిన మొదటి పని 13వ ఆర్థిక సంఘం నిధులు 14కోట్ల పనులకు వేసిన టెండర్లను రద్దు చేయడం. ఈ పని చేయడం ద్వారా ఆయన పాలకవర్గం పట్ల తన అభిమానాన్ని చాటుకున్నాడు.

నెల్లూరు కార్పొరేషన్‌లో 13వ ఆర్థిక సంఘం నిధులతో 14కోట్ల పనులకు టెండర్లు పిలవడం, కమిషన్‌ల వాటాలు పంచుకుని మేయర్ వర్గం కార్పొ రేటర్స్ కమ్ కాంట్రాక్టర్లు ఎక్సెస్ రేట్లతో టెండర్లు వేయడం, వీరికి పోటీగా ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, ఆనం వర్గానికి చెందిన కాంట్రాక్టర్లు లెస్‌లతో టెండర్లు వేయడం తెలిసిందే! ఈ టెండర్లను ఓపెన్ చేస్తే మేయర్ వర్గీయులైన కాంట్రాక్టర్లకు ఒక్క పని కూడా దక్కదు. అందుకే మేయర్ అజీజ్ టెండర్ల బాక్స్ గది తాళాన్ని తన కంట్రోల్‌లో ఉంచుకుని పాత కమిషనర్ వెళ్లే దాకా వేచి చూశాడు. కొత్త కమిషనర్‌గా వెంకటేశ్వర్లు రాగానే టెండర్లు రద్దు చేసి తన విశ్వాసాన్ని చాటుకున్నాడు. వెంకటేశ్వర్లు నెల్లూరు కమిషనర్‌గా రావడంలో మేయర్ అజీజ్ సహకారం వుంది. నవంబర్‌లో సంభవించిన వరదల్లో సహాయ చర్యలు నిమిత్తం గుంటూరులో ఆర్‌డిగా వున్న వెంకటేశ్వర్లు ఇక్కడకు వచ్చాడు. ఇక్కడే మేయర్‌తో స్నేహం ఏర్పడింది. వెంకటేశ్వర్లు అయితే తనకు అనుకూలంగా ఉంటాడని అజీజ్ మంత్రి ద్వారా ప్రయత్నించి ఇక్కడ కమిషనర్‌గా వేయించుకున్నాడు.

## నివాళి...



ఆత్మబంధువు, ఆత్మీయ సింధువు

**చిట్టమూరు పద్మనాభరెడ్డి గారి**

దివ్య స్మృతికి మా నివాళి.



తుంగా కుటుంబం.

# చిన్నపిల్లల కోసం 'లిటిల్ టీత్'



చిన్నపిల్లల కోసం అత్యాధునిక వైద్య సదుపాయాలతో దంత వైద్యశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఈ వైద్యశాల భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ యం.జానకి పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు పొగతోటలోని రిచ్ ఆసుపత్రికి అనుబంధ సంస్థ అయిన లిటిల్ టీత్ చిన్నపిల్లల దంత వైద్యశాలను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయబడిన దంత ఆపరేషన్ థియేటర్ వల్ల చిన్నపిల్లలకు ఆధునిక వైద్యం అందుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా లేని విధంగా ఇటువంటి సర్వీసులను అందిస్తున్న డాక్టర్ రవి కుమార్ అభినందనీయుడన్నారు.

డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ గత 25సంవత్స రాలుగా చిన్నపిల్లల వైద్యసేవల అనుభవంలో చిన్న పిల్లల్లో ఎన్నో రకాల దంత సమస్యలను గుర్తించడం జరిగిందన్నారు. దంత సమస్యల వల్ల చిన్నపిల్లలకు అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని పిల్లల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన దంతవైద్యాన్ని అందించడమే కాకుండా వారి జీవన ప్రమాణాలను పెంచడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డా॥ టి.వసంతలక్ష్మి, డాక్టర్ కె.వి.రత్నం, వివియన్ నాయుడు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ శివకుమార్, డాక్టర్ శ్రీకాంత్ తది తరులు పాల్గొన్నారు.

# రోగులకు పండ్లు పంపిణీ



ప్రముఖ సేవాతత్పరుడు మాగుంట శరత్‌చంద్రారెడ్డి వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి సభ్యులు నెల్లూరు ప్రభుత్వవైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెల ప్యాకెట్లు అందజేశారు. శరత్‌చంద్రారెడ్డి సేవాభావం వెల్లివిరియాలని, తద్వారా నిరుపేదలకు ఆయన సేవలు అందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు రహీం, కమల్, సన్నీ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# బండి కొన్న చోటే రిజిస్ట్రేషన్

ఇప్పటి వరకు వాహనం కొనడం ఒకెత్తయితే దానిని రిజిస్ట్రేషన్ చేయించుకోవడం మరోఎత్తు. ముఖ్యంగా డబ్బు ఖర్చుకంటే కూడా రిజిస్ట్రేషన్‌కు ఒక రోజంతా కేటాయించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ శ్రమ లేకుండా బండి కొన్నచోటే రిజిస్ట్రేషన్ తంతు కూడా ముగించనున్నారు. రిజిస్ట్రేషన్ బాధ్యతలను ఇక వాహన షోరూంలకే అప్పగించనున్నారు. వాహనాల కొనుగోలుదారులకు ఇది ఎంతో సౌకర్యవంతంగా ఉండబోతోంది.

# మాట కంటే శక్తివంతమైంది పాట



ఉత్తేజం... ఉత్సాహం నింపే పాట, మాట కన్నా శక్తివంతమైందని నెల్లూరు రూరల్ శాసన సభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నాడు. నెల్లూరు టౌన్‌హాల్లో 13వ తేదీ సంస్కృతి తరం గాలు ఛారిటబుల్ ట్రస్ట్, భాషా సంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు చలనచిత్ర రంగం 80వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చలన చిత్ర సంగీత విభావరి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ ఆహ్లాదాన్ని, ఆనం దాన్నిచ్చే పాటలతో శ్రోతలను వీనులవిందు చేసేలా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ కళాకారుల్లో ప్రతిభను గుర్తించి ఆదరించేందుకు కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత బేబి రేణిగుంట సుమేధ కూచిపూడి నృత్యం, మరోపాటకు రింగ్‌తో నర్తించి చేసిన నృత్యం ప్రేక్షకుల కరతాళధ్వనులు అందుకొంది. అనంతరం నాటి, మేటి చిత్రాల్లోని మధురగీతాలను గాయనీగాయకులు ఆలపించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు సంగీత కళాశాల ప్రిన్సిపాల్ మద్దెల సాయిబాబా, మాజీప్రిన్సిపాల్ మునికుమార్, మురళీకృష్ణ హోటల్స్ యండి వీరిశెట్టి హజరత్‌బాబు, నలుబోలు బలరామయ్యనాయుడు, బి.వి. నరసింహం, వల్లకవి వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# సెలవులో జేసీ



జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ సెలవు పెట్టారు. 40 రోజుల పాటు ఆయన హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో ఐఏఎస్‌కు సంబంధించిన శిక్షణ పొందనున్నారు. మార్చి 25 తర్వాత ఆయన తిరిగి విధుల్లోకి వస్తారు.

# యాక్ట్(4)ను తొలగించాలి



వ్యాపారస్తులను ఇబ్బందులు పెట్టే రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన కమర్షియల్ టాక్స్ యాక్ట్‌లోని అమెండ్‌మెంట్ యాక్ట్(4) 2016ను వెంటనే తొలగించాలని ఆంధ్ర ప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ట్రేడ్ ఉపాధ్యక్షుడు, నెల్లూరు జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రేడ్ గౌరవాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి కోరారు. ఆదివారం నెల్లూరు పప్పులవీధిలోని శ్రీ పాండురంగ అన్నదాన సమాజంలో జరిగిన జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ యాక్టు అమలైతే వ్యాపారులు పలు సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ సమస్యను జిల్లాలోని ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దాసా లక్ష్మీనారాయణ, మంచికంటి శ్రీనివాసులు, అడిషనల్ జనరల్ సెక్రటరీ సొల్లేటి వెలుగొండయ్య, చలువాది నాగేశ్వర రావు, శ్రీరాం సురేష్, దరిశి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లు కోరిన మేయర్

ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్. 15వతేదీ ఆయన విజయవాడలో సీఎంను కలిశారు. ముస్లిం యువకులు ఉద్యోగాలు లేక దుర్భర జీవితం గడుపుతున్నారని, 4శాతం రిజర్వేషన్లకు చట్ట బద్ధత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# నెల్లూరు కబుర్లు

## మాగుంట లే అవుట్‌లో వైకాపా కార్యాలయం

నెల్లూరు, మాగుంట లే అవుట్‌లోని కింగ్స్‌కోర్టు ఎవెన్యూలో వైకాపా జిల్లా కార్యాలయ నిర్మాణం పనులు చకచక జరుగుతున్నాయి. సువిశాలంగా వున్న ఖాళీస్థలాన్ని లీజుకు తీసుకుని కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ కార్యాలయం నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. వైకాపా జిల్లా ఆఫీసును మొదట కలెక్టర్ బంగ్లా వద్ద పెట్టారు. ఆ తర్వాత మాగుంట లే అవుట్‌లో రెండు భవనాలకు మార్చారు. గత కొన్ని నెలలుగా పార్టీ జిల్లా కార్యాలయమే లేదు. అయితే పార్టీ జిల్లా వ్యవహారాలను చూస్తున్న ఒంగోలు ఎంపి వై.వి.సుబ్బారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కాకాణితో చర్చించి పార్టీ జిల్లా కార్యాలయ నిర్మాణాన్ని మొదలు పెట్టించారు. పార్టీ కార్యాలయాన్ని త్వరలోనే ప్రారంభించే విధంగా పనులు జరుగుతున్నాయి.

## వాత్సల్యలో రథసప్తమి వేడుకలు



నెల్లూరు కొండాయపాలెం రోడ్డులోని వాత్సల్య ఉన్నత పాఠశాల ప్రాంగణంలో తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యోగా గురువు ముప్పిరాల లక్ష్మీ నరసింహశాస్త్రి ఆధ్వర్యంలో విద్యార్థులు సూర్య నమస్కారాలు ప్రదర్శించారు. పాఠశాల తెలుగు పండితులు మూర్తి ఆదిత్య హృదయం, సూర్యభగవానుని విశిష్టతలను వివరించారు. ఈ కార్యక్రమంలో జనహిత-వాత్సల్య సంఘటన కార్యదర్శి జి.వి.సాంబశివరావు, హిందూధర్మ ప్రచార పరిషత్ సభ్యులు దుర్గాప్రసాద్, ఏపియూడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి ఎ.జయప్రకాష్, ప్రధానోపాధ్యాయుడు మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.

## 'కిషోర్స్ రత్నం'లో దంతవైద్య శిబిరం



నెల్లూరులోని రత్నం ఎన్‌క్లేవ్‌లో వున్న కిషోర్స్ రత్నం స్కూల్లో ఈ నెల 13న విద్యార్థులకు ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. బాలబాలికల్లో సహజంగా వచ్చే దంత వ్యాధులు-వాటి నివారణ పట్ల విద్యార్థులకు వైద్యులు అవగాహన కలిగించారు. ఎక్కువగా శీతల పానీయాలు సేవించడం, పళ్లను సరిగా శుభ్రం చేసుకోకపోవడం, బయట తినుబండారాలు తినడం వంటి వాటివల్ల దంత సమస్యలు వస్తాయని, విద్యార్థులు దంత సమస్యల పట్ల నిర్లక్ష్యం చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు దంతపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, సీనియర్ మేనేజర్ రాజేష్, ప్రిన్సిపాల్స్ సునీత, ఉమారాణి, మేనేజర్ అజయ్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కిమ్స్‌లో అరుదైన ఆపరేషన్

నెల్లూరులోని బొల్లినేని (కిమ్స్) ఆసుపత్రిలో మరో అరుదైన శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. పుట్టుకతోనే ముక్కులోపలి రంధ్రం ఎముకతో కప్పబడి పూర్తిగా మూసుకుపోవడంతో అవస్థపడుతున్న ఒక బాలునికి శస్త్ర చికిత్సను నిర్వహించి ఆ బాలుడిని బాధలనుంచి తప్పించారు. ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు ఆ వివరాలను విలేకరులకు వెల్లడించారు. అనుమసముద్రంపేటకు చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు బాలాజీ అనే ఎనిమిదేళ్ళ బాలుడికి తరచూ జ్వరం, శ్వాసకోశ సమస్యలు వస్తుండడంతో ఈ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ముక్కులోని రెండు రంధ్రాల్లో ఒక రంధ్రం మూసుకుపోగా, మరొక రంధ్రం ద్వారానే ఆ బాలుడు శ్వాస తీసుకుంటున్నాడు. ఆసుపత్రిలో వున్న ప్రముఖ ఇఎన్‌టి వైద్యుడు రాజేష్ ఆ బాలుడిని పరిశీలించి ఎండోస్కోపీ పరీక్ష నిర్వహించి ఆ బాలుడికి మెడ్‌ట్రానిక్ ఐపిసి డ్రిల్లింగ్ మిషన్ ద్వారా, ఎలాంటి నొప్పి లేకుండా మత్తు ఇచ్చి ముక్కు రంధ్రాన్ని సరిచేశారు. బొల్లినేని ఆసుపత్రిలోనే ఇలాంటి అధునాతనమైన పరికరం వుందని ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తెలిపారు. ఆ బాలుడు పేద కుటుంబానికి చెందినవాడు కావడంతో మందుల ఖర్చు మినహా, ఆపరేషన్ అంతా ఉచితంగానే చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్, మెడికల్ సూపరింటెండెంట్ రంగారావు పాల్గొన్నారు.

# నెల్లూరుకు వరంగా విఆర్‌కె సిల్క్స్




ఆంధ్రప్రదేశ్‌లోనే కాక తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో సైతం వస్త్ర వ్యాపారంలో తమదైన ముద్ర వేసుకున్న కళానికేతన్ వారు నెల్లూరులోని వస్త్రాభిమానులకు మరో కానుకను అందించారు. నెల్లూరు, కెవిఆర్ పెట్రోల్‌బంకు సెంటర్‌లో గల ఉమెన్స్ వరల్డ్ షోరూం ప్రాంగణంలో కాంచీపురం విఆర్‌కె సిల్క్సును ఈ నెల 13న ప్రముఖ సినీ హీరోయిన్ శ్రియ చేతుల మీదుగా ప్రారంభించారు. నెల్లూరువాళ్ళు వివాహాది శుభకార్యాలలో పెళ్లి పట్టుచీరల కోసం ఇప్పటివరకు కాంచిపురం వెళ్లేవాళ్ళు. ఇప్పుడు ఆ అవసరం లేకుండా కళానికేతన్ వాళ్ళే కాంచీపురంను నెల్లూరుకు తీసుకువచ్చారు. ఉమెన్స్ వరల్డ్‌లో గ్రౌండ్, ఫస్ట్‌ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన కాంచీపురం విఆర్‌కె సిల్క్స్ షోరూంను శ్రియ ప్రారంభించగా ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, మేయర్ అబ్దుల్ అజీజ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రియ మాట్లాడుతూ అన్నింటిలో సింహపురి ప్రత్యేకమైందని, ఇక్కడ అభిమానులు తనపై చూపిస్తున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. సంస్థ మనేజర్ విజయకుమార్ మాట్లాడుతూ వైవిధ్యానికి, విలక్షణ సోయగానికి పేరొందిన కాంచీపురం వస్త్రాల కోసం కాంచీపురం వెళ్ళనవసరం లేకుండా నెల్లూరులో కొనుగోలు చేసేందుకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ వస్త్రాలు వీవర్స్ ధరలకే రూ.695 నుంచి రూ.2లక్షల వరకు అందుబాటు ధరల్లో లభిస్తాయన్నారు. వస్త్రాభిమానుల ఆదరాభిమానాలు చూరగొంటు వస్త్ర ప్రపంచంలో మరో ముందడుగు వేసిన కళానికేతన్ యాజమాన్యానికి 'లాయర్' అభినందనలు.



# టెండర్లు ఎందుకు రద్దు చేశారు?

నెల్లూరు నగరపాలక సంస్థ వారు 13వ ఆర్థికసంఘం నిధులతో పనులను ప్రారంభించకుండా ఇంతకాలం కాలయాపన చేసి, ఇప్పుడు వేసిన టెండర్లను ఏ కారణంతో రద్దు చేశారంటూ నెల్లూరు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు సూటిగా ప్రశ్నించారు. ఈ నెల 13న నగరపాలక సంస్థ కార్యాలయంలోని డిప్యూటి మేయర్ ఛేంబర్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ, నగరపాలక సంస్థ అధికారుల తీరుపై తీవ్రంగా ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, కొత్తగా వచ్చిన జిఒను అడ్డం పెట్టుకుని అధికార పార్టీ నాయకులు నామినేషన్ పనుల్లో దోపిడీకి పాల్పడితే సహించేది లేదన్నారు. ఈ విషయాన్ని మంత్రి నారాయణ దృష్టికి కూడా తీసుకువచ్చామన్నారు. 1981లో నామినేషన్ల మీద కాంట్రాక్ట్‌లను ఇచ్చినందుకు కౌన్సిలర్లను తొలగించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. అప్పట్లో నామినేషన్‌ల పనుల అవకతవకలకు సంబంధించి ఇరిగేషన్ విభాగంలోని ఇంజనీర్లు జైలుపాలయ్యారని అంటూ, అధికారపార్టీ వారు చేస్తున్న పాపాల్లో ఇంజనీరింగ్ అధికారులు బలి కావద్దని ఆయన సూచించారు. ఇప్పుడు కూడా నామినేషన్ పనుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే అలాంటి పరిస్థితే ఏర్పడుతుందని హెచ్చరించారు.

# ప్రకృతి వైపరీత్యాలతో జాగ్రత్త

## - ఇన్‌ఛార్జి మంత్రి శిద్దా రాఘవరావు



ప్రకృతి వైపరీత్యాల పట్ల ఎల్లవేళలా అప్రమత్తంగా వుండాలని, ఎప్పటికప్పుడు ముందు జాగ్రత్తలు తీసుకుంటూ వుండాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శిద్దా రాఘవరావు జిల్లా అగ్నిమాపకశాఖ అధికారులకు సూచించారు. ఈ నెల 13న నెల్లూరుకు వచ్చిన మంత్రి, నగరంలోని రైల్వేఫీడర్స్‌లో రూ.1.26 కోట్లతో నిర్మించిన అగ్నిమాపక శాఖ కార్యాలయ నూతన భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అగ్నిమాపక సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలకు ఎంతో నష్టం జరుగుతుంది కనుక, ఎల్లవేళలా అప్రమత్తంగా వుండాలన్నారు. గత ఏడాది సంభవించిన ప్రకృతి వైపరీత్యాల్లో ప్రజల ఆస్తులను కాపాడే విషయంలో జిల్లా అగ్నిమాపక సిబ్బంది పనితీరు ప్రశంసనీయమన్నారు. బహుళ అంతస్తుల భవనాల్లోనూ, వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, సినిమా థియేటర్లు, విద్యా సంస్థల్లో విధిగా అగ్నిమాపక నిరోధక పరికరాలను ఏర్పాటుచేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, వాకాటి నారాయణరెడ్డి, అగ్ని మాపకశాఖ రీజనల్ అధికారి డి.మురళీమోహన్, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి జ్ఞానసుందరం, జిల్లా సహాయ అగ్నిమాపక శాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు, నెల్లూరు అగ్నిమాపక శాఖ అధికారి పి.శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నాయకులు నెలవల సుబ్రహ్మణ్యం, టి.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.



# 'జికా'కు చెక్ పెడదాం

రోగ నిరోధక శక్తిని నిర్వీర్యం చేసే జికా వైరస్ వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి అధికారులను ఆదేశించారు. జికా వైరస్ పై ఆదివారం నెల్లూరు కలెక్టరేట్‌లోని గోల్డెన్ జూబ్లీ హాలులో జరిగిన సమావేశంలో ఆమె అధికారులనుద్దేశించి మాట్లాడారు. జికా వైరస్ ప్రాణాంతక వ్యాధి కానప్పటికి వాటి దుష్ఫలితాలు ఎక్కువుగా వుంటాయని, దోమల ద్వారా వ్యాపించే ఈ వ్యాధి డెంగ్యూ వ్యాధి లక్షణాలను పోలివుంటుందని ఆమె తెలిపారు. నిల్వవున్న మంచినీళ్లు, పాత టైర్లు, కొబ్బరిబోండాలలో లార్వా జనించి వాటి ద్వారా వచ్చే దోమల వల్లే ఈ జికా వైరస్ వ్యాప్తి చెందుతుందని ఆమె వివరించారు. విదేశాల నుండి వచ్చే వారిపట్ల అప్రమత్తంగా వుండాలని, కృష్ణపట్నం పోర్టు పారిశ్రామిక పనులపై వచ్చే విదేశీయులను గమనించాలని ఆమె పోర్టు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధి కారి డాక్టర్ వరసుందరం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జపాన్ పారిశ్రామికవేత్తలకు శ్రీసిటీ విందు



దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తడ సమీపంలోని శ్రీసిటి సెజ్ పురోగతిలో జపాన్ దేశ పరిశ్రమల భాగస్వామ్యం ఎంతైనా వుంది. శ్రీసిటీ మీద నమ్మకంతో ఇక్కడ భారీసంఖ్యలో మొదట పరిశ్రమలు స్థాపించింది వారే! ఈ నేపథ్యంలో ఇటీవల చెన్నైలోని కోర మాండల్ హోటల్‌లో శ్రీసిటీ యాజ మాన్యం ఆత్మీయ విందునిచ్చింది. చెన్నై లోని జపాన్ దేశ వాణిజ్య దూత సైజీ బాబా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. జపాన్ మాజీరాయబారి యసుకిని ఎనోకి, అమెరికా, ఆస్ట్రేలియా, రష్యా, దక్షిణ కొరియా, ఫ్రాన్స్, బెల్జియం, థాయిలాండ్, మలేషియా దేశాల వాణిజ్య రాయబారులు ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా వచ్చారు. అతిథులందరికీ స్వాగతం పలుకుతూ శ్రీసిటీ ఎండి రవీంద్ర సన్నారెడ్డి, ప్రస్తుతం శ్రీసిటీలో 16జపాన్ పరిశ్రమలు పనిచేస్తున్నాయని, వ్యాపారపరంగా ఆ సంస్థలన్నీ చక్కని విజయాలను సాధించాలని ఆకాంక్షిస్తూ మిత్రులందరితో ఈ సాయంత్రం ఆనందంగా గడపాలన్న ధ్యేయంతో ఈ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యఅతిథి సైజీ బాబా మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక వసతులను కలిగియుండటంతో పాటు అత్యంత అనువైన నివాస ప్రాంతంగా శ్రీసిటీ అభివృద్ధి చెందుతుందని, ఇటువంటి ప్రదేశంలో తమ కేంద్రాలను స్థాపించినందుకు జపాన్ పారిశ్రామిక సంస్థలు సంతృప్తి చెందాయన్నారు. కోస్ట్‌గార్డ్ ఐజీ సత్యప్రకాష్ శర్మ, శ్రీసిటీ డెవలప్మెంట్ కమిషనర్ అనిల్.కె.చౌదరి, పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తరువాత జరిగిన క్విజ్ కార్యక్రమంలో అతిథులందరూ ఆసక్తితో పాల్గొన్నారు. ఈ పోటీలో సైజీ బాబా విజేతగా నిలిచారు. చెన్నైలోని జపానీస్ స్కూల్ విద్యార్థులు, జపాన్-భారత సంస్కృతి వైభవాలను ప్రతిబింబించే విధంగా రూపొందించిన కళారూపాలను ప్రదర్శించి ఆహూతులలంరినీ అలరించారు.





| వీవర్స్ ఉత్సవ్ స్పెషల్స్ | రిటైల్ ధర | వీవర్స్ ధర |
|---|---|---|
| కంచి కళ్యాణ పట్టు శారీ | 1965 | 799 |
| కంచి కామాక్షి పట్టు శారీ | 2286 | 899 |
| కంచి హస్తకళా పట్టు శారీ | 3395 | 2296 |
| కంచి ధరణి స్టోన్ బ్రొకేట్ శారీ | 4990 | 1890 |
| కంచి మయూర పట్టు శారీ | 5790 | 2986 |
| కంచి ప్రియదర్శిని ఆఫ్ సిల్క్ శారీ | 2350 | 1285 |

# తహాశీల్దార్‌కు వినతుల వెల్లువ



తహాశీల్దార్‌తో సమస్యలపై చర్చిస్తున్న చైర్‌పర్సన్ పొనకా దేవసేన

గూడూరు పట్టణ గ్రామీణ ప్రాంతంలోని రెవెన్యూ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తహాశీల్దార్ బి.సత్యవతిని చైర్‌పర్సన్ పొనకా దేవసేన, తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జ్యోత్స్నలత వేర్వేరుగా కలసి కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఏళ్ల తరబడి రెవెన్యూ సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, వీటిపై స్పందించి చర్యలు తీసుకోవాలని జ్యోత్స్నలత తెలిపారు. అలాగే పట్టణంలోని ఇరిగేషన్ కాలువలు ఆక్రమణపై రెవెన్యూ పరంగా సర్వే జరిపి హద్దులను ఏర్పాటు చేయాలని పొనకా దేవసేన కోరారు. ఇన్‌కం, క్యాస్ట్ సర్టిఫికేట్లు ప్రజలకు ఆలస్యం అవుతున్నాయని, త్వరగా ప్రజలకు వచ్చేటట్లు చేయాలని కోరారు. ఈ క్రమంలోనే సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినం సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన అర్జీదారులు తమ సమస్యలను విన్నవించి పరిష్కరించాలని మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# బడుగుల ఆశాదీపం సంజీవయ్య

## - ఎమ్మెల్యే పాశం సునీల్

బీసీ వర్గాల అభ్యున్నతికి మాజీ ముఖ్యమంత్రి సంజీవయ్య ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం సాయంత్రం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సంజీవయ్య 95వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితుడైన సంజీవయ్యను గుర్తుంచుకొని జయంతి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బీసీలకు రిజర్వేషన్ కల్పించడంలో ఆయన కృషి ఎనలేనిదన్నారు. బాగా చదివితే రిజర్వేషన్ లేకపోయినా రాణించవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన అన్నారు. రిజర్వేషన్ సౌకర్యం కలిగి ఆర్థికంగా స్థిరపడ్డవారు దాన్ని వదులుకుంటే వేరొకరికి అవకాశం కలుగుతుందన్నారు. అంతకుముందు సంజీవయ్యకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొంతమంది నాయకులను, పత్రికల తరపున 'లాయర్' వారపత్రిక గూడూరు ఇన్‌ఛార్జి ఆనిమెళ్ళ శివకుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్యేయాదవ్, పద్మజాయాదవ్, నాశిన భాస్కర్‌గౌడ్, ఎంబేటి చంద్రయ్య, మగ్దూమ్, ఎల్వీ సుబ్బయ్య, కేఆర్ దాసరి తదితరులు పాల్గొన్నారు.



'లాయర్' గూడూరు ఇన్‌ఛార్జి ఎ.శివకుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీల్, చైర్‌పర్సన్ దేవసేన

## గూడూరు డివిజన్ వార్తలు

# విద్యార్థులకు వైద్య సేవలు



మాట్లాడుతున్న యస్.రామ్మోహన్‌రావు

గూడూరు జానకిరాంపేట యస్‌సి హాస్టల్‌లోని 250మంది విద్యార్థులకు ఉచితంగా డెంటల్, ఐ, జనరల్ చెకప్ వైద్యపరీక్షలు చేయించినట్లు యస్.వి.రత్నం ఛారిటీస్ ఛైర్మెన్ శ్రీకంటి రామమోహన్‌రావు తెలిపారు. యస్.వి.రత్నం ఛారిటీస్ మరియు రోటరీ క్లబ్ వెస్ట్ సహకారంతో ఈ మెడికల్ క్యాంపును నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులతో కాకుండా హాస్టల్స్‌లో ఉంటారు కాబట్టి వారికి ప్రతి సంవత్సరం వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెస్ట్‌క్లబ్ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, కార్యదర్శి వైఆర్‌కెరెడ్డి, వై.గోపాల్‌రెడ్డి, నాశిన నాగులు తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా శ్రీనివాస కళ్యాణం



కళ్యాణోత్సవాన్ని జరిపిస్తున్న అర్చకస్వాములు



అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

గూడూరు నరసింగరావుపేట శ్రీ సాయి మందిర ప్రాంగణంలో ప్రధాన అర్చకులు, నెల్లూరు వాస్తవ్యులు ఫణీంద్రస్వామి వారి ఆధ్వర్యంలో, శ్రీ గురుసాయి మందిర కమిటి పర్యవేక్షణలో ఆదివారం రథసప్తమి పర్వదినం సందర్భంగా శ్రీనివాస కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. పుష్పయాగం భక్తులకు కనువిందు చేసింది. కోలాటాలు, పట్టణ సంకీర్తనలతో కళ్యాణోత్సవం ప్రారంభమైంది. విద్యుద్దీపకాంతుల్లో దేదీప్యమానంగా అలంకరించిన పుష్పాలంకరణ శోభితమైన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కళ్యాణాన్ని అర్చకస్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో సంప్రదాయ దుస్తుల్లో తరలివచ్చిన భక్తజనం కళ్యాణోత్సవాన్ని గోవింద నామస్మరణలు చేస్తూ తిలకించారు. కళ్యాణం సమయంలో పాడిన మధురమైన అన్నమయ్య కీర్తనలు అందరిని అలరించాయి. అనంతరం భక్తజనం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలకు, విచ్చేసిన భక్తులందరికీ ఆలయ కమిటీ తరపున జి.కె.గురుగుహ, జి.శ్రీనివాసకుమార్ ధన్యవాదాలు తెలిపారు.

## శ్రీకాళహస్తి న్యూస్

# బాల్య వివాహాలు నిర్మూలిద్దాం

## - కోలా ఆనంద్



బాల్య వివాహాలను నిర్మూలించేందుకు అందరూ కలసి కృషి చేయాలని బిజెపి పార్టీ నాయకుడు కోలా ఆనంద్‌కుమార్ అన్నారు. సోమవారం శ్రీకాళహస్తిలోని బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా మోర్చా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడం సాంప్రదాయమన్నారు. ఈ కళ్యాణోత్సవం రోజు నిరుపేదలు, చిన్న వయసులో ఉన్న బాలికలకు వివాహం చేస్తారన్నారు. కాబట్టి అటువంటివి గుర్తించి బాలికలను రక్షించాలన్నారు. గ్రామాల్లో బిజెపి మహిళా విభాగం విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. గతంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా ఉన్నప్పుడు మానవహక్కుల కమిషన్ ఇక్కడకు వచ్చి ఎంతో మంది బాలికలను గుర్తించి రక్షించారన్నారు. మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు లత మాట్లాడుతూ బాల్య వివాహం దేవుని పెళ్ళిలో చేయకుండా పర్యవేక్షిస్తామన్నారు. బిజెపి పార్టీ మహిళలే కాకుండా కార్యకర్తలు కూడా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, జిల్లా స్వచ్ఛభారత్ కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, మాజీ అధ్యక్షుడు సుకుమార్, పట్టణాధ్యక్షుడు పగడాల రాజు, సీనియర్ నాయకులు అంజూరు వెంకటేష్‌బాబు, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి వయ్యాల మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్లు పుష్ప, ముత్తు, తదితరులు పాల్గొన్నారు.


# హెల్మెట్‌తో లైఫ్ సేఫ్



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పీ బి.శ్రీనివాస్

ప్రయాణ సమయాల్లో ద్విచక్రవాహనదారులు శిరస్త్రాణం ధరిస్తే ప్రాణరక్షణగా ఉంటుందని డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ తెలిపారు. గూడూరు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో సోమవారం శ్రీలక్ష్మి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు డిఎస్పీ చేతుల మీదుగా శిరస్త్రాణం పంపిణీ కార్యక్రమాన్ని పట్టణ సిఐ సుబ్బారావు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ సమాజంలో ప్రజలకు శిరస్త్రాణంపై అవగాహన కల్పించి అందరూ తప్పనిసరిగా ప్రయాణ సమయాల్లో ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు శ్రీలక్ష్మి, గ్రామీణ సి.ఐ శ్రీనివాసరెడ్డి, దశరథరామారావు, బాబి, జగన్‌మోహన్‌రావులు పాల్గొన్నారు.

# భయపెట్టిన భవనాన్ని కూల్చేశారు



గూడూరు పట్టణంలోని సనత్‌నగర్‌లో పక్కకు ఒరిగిన భవనాన్ని పురపాలక సంఘ అధికారులు 13వ తేదీ అర్ధరాత్రి కూల్చివేశారు. యంత్రాలను వినియోగించి మూడంతస్తుల భవనాన్ని నేలమట్టం చేశారు. దీంతో అక్కడి జనం ఊపిరి పీల్చుకొన్నారు. పునాదులు పటిష్టంగా లేకపోవడం, కాలువను ఆక్రమించి ఎలాంటి అనుమతుల్లేకుండా భవనాన్ని నిర్మించడంతో భవనం పక్కకు ఒరిగి ప్రజలను భయాందోళనలకు గురిచేసిన విషయం తెలిసిందే! ప్రమాదకరంగా ఉన్న భవనాన్ని పూర్తిగా కూల్చివేశారు. అధికారులు మామూళ్ళు పుచ్చుకొని చూసీచూడనట్లు వ్యవహరించడంతోనే సనత్‌నగర్‌లో పంట కాలువపై భవనం నిర్మించడం జరిగి ఓ పక్కకు ఒరిగిపోయిందని ప్రజలు అంటున్నారు. అక్రమ కట్టడాలపై కఠినంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

గల్పిక

# పాకిస్థాన్‌లో పెరిగిన రాహుల్ క్రేజ్

అది పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్. ప్రధానమంత్రి నవాజ్‌షరీఫ్ కార్యాలయం. నవాజ్ షరీఫ్ తన మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశమై ఉన్నాడు. ఆయన ముఖం చాలా సీరియస్‌గా వుంది. ఆయన తన సెల్‌ఫోన్ తీసి ఒక నెంబర్ కొట్టాడు. అవతల వ్యక్తి ఫోన్ ఎత్తాడు. షరీఫ్ కోపంగా... ఏంటి నరేంద్ర మోడీ భాయ్ ఇది... కాశ్మీర్‌తో సహా అన్ని సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకొందామనుకున్నామా... అక్కడ చూస్తే కాశ్మీరీ స్వతంత్ర పోరాటవాదులకు మద్దతు పలికినవాళ్లకు మీ దేశ నాయకులే సపోర్ట్ చేస్తున్నారు. మొన్న జెఎన్‌యులో జరిగిన ఇన్సిడెంట్‌తో మా దేశంలో రాహుల్‌గాంధీకి విపరీతంగా క్రేజ్ పెరిగిపోయింది. మా దేశ ప్రజలు, ఐఎస్‌ఐ వాళ్లు, ఉగ్రవాద సంస్థ నాయకులంతా నా ముఖాన్నే... నీకంటే ఆ రాహుల్ గాంధీయేనయం అంటున్నారు. అతను గనుక మా దేశంకు వచ్చి ప్రధానిగా పోటీ చేస్తే గెలిపించేసేటట్లున్నారు అని చెప్పాడు. అవతల నుండి నరేంద్ర మోడీ కూడా... భారత దేశంలో అతనికెలాగూ ప్రధాని అయ్యే రాత లేదు... కనీసం మీ దేశమన్నా తీసుకెళ్లండి, రాహుల్‌ను ప్రధానిని చేయాలన్న వాళ్ల అమ్మ కల నెరవేరుతుంది, మాకు ఓ తలనొప్పి తగ్గుతుందంటూ ఫోన్ పెట్టేశాడు.

★★★★★

ఢిల్లీలోని 'ఆప్' కార్యాలయం. ఆ పార్టీ ఆఫీసు ముందు ఒక బోర్డు ఇలా వ్రాసింది. రేపిస్ట్‌లకు ఇక్కడ పునరావాసం కల్పించబడును. దేశ ద్రోహానికి పాల్పడి మరణశిక్షకు గురైన ఉగ్రవాదులకు మద్దతుగా ప్రదర్శనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టేవారికి సంపూర్ణ మద్దతు ఇవ్వబడును. అలాంటివారు ఎక్కడ కార్యక్రమాలు పెట్టినా ముందుగా మాకు సమాచారం ఇవ్వగలరు. ఇట్లు, అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ సీఎం... అని. లోపల తన ఛాంబర్‌లో అరవింద్ కేజ్రీవాల్ అతనికెదురుగా నాగేంద్రయాదవ్, మనీష్‌సిసోడియా వంటి 'ఆప్' నేతలున్నారు. అరవింద్ కేజ్రీవాల్ ఎవరితోనో ఫోన్‌లో గట్టిగా మాట్లాడుతున్నాడు. ఇది పద్ధతిగా లేదు రాహుల్‌జీ... నాకు తెలియకుండా, నాతో చెప్పకుండా నా ఢిల్లీ పరిధిలోకి వచ్చే యూనివర్శిటీ పరిధిలోకి ముందు మీరెలా వెళతారు. మొన్న హైదరాబాద్ యూనివర్శిటీకి కూడా ముందు మీరే వెళ్లారు. ఇప్పుడు జెఎన్‌యుకూ మీరే ముందెళ్లారు. ఇదెక్కడి న్యాయం. ఈసారి నుండి ఉరితీయబడ్డ ఉగ్రవాదులకు మద్దతుదారులపై కేంద్రం చర్యలకు దిగితే ఇద్దరం ఒకే కారులో కలిసిపోయి పోరాడుదామన్నాడు. దానికి అవతల నుండి రాహుల్ ఓకే చెప్పడంతో అరవింద్ కేజ్రీవాల్ ఫోన్ పెట్టేశాడు.

★★★★★

అది ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కార్యాలయం. మోడీతో కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, మనోహర్ పారికర్, యం.వెంకయ్యనాయుడులు సమావేశమై ఉన్నారు. మోడీ వారితో... ఇదేంటి... ఏ దేశంలో అయినా వీరులకు, దేశభక్తులకు, వీర జవానులకు అభిమానులుంటారు. ఇక్కడేంటి... వేలాదిమందిని చంపిన ఉగ్రవాదులకు అభిమానులు, మద్దతుదారులుంటున్నారు. వీళ్లకు మళ్లీ రాజకీయ నాయకులు వత్తాసుపలుకుతున్నారు. ఈ దేశం ఎక్కడికి పోతోంది, మన దేశంలో మన ప్రజల్ని పొట్టనపెట్టుకున్న నరహంతకులకు మద్దతు పలకడమేంటని ఆశ్చర్యంగా అడిగాడు. దానికి వెంకయ్యనాయుడు... అంతా సినిమా, మీడియా ప్రభావం సార్! అని అన్నాడు. ఆ మాటకు మోడీతో పాటు మిగతా వాళ్లు కూడా అవాక్కయ్యారు. సినిమాలకు, ఉగ్రవాదుల పట్ల సానుభూతి పెరగడానికి లింకేంటని మనోహర్ పారికర్ అడిగాడు. అప్పుడు వెంకయ్య... సార్, లవకుశ, సంపూర్ణ రామాయణం, పాండవ వనవాసం, గుండమ్మకథ, మూగమనసులు వంటి సినిమాల కాలంలో దేశం ఎంతో ప్రశాంతంగా ఉండేది. ఇప్పుడు సినిమాలన్నీ సగం హింస, సగం ప్రేమ చుట్టూ తిరుగుతున్నాయి. సినిమాలో హీరోను పద్ధతిగా చూపిస్తే ఎవరికీ నచ్చడం లేదు. హీరో పెద్ద వెధవై ఉండాలి. అమ్మాయిలను ఏడిపించాలి, కనిపించినవాడినల్లా తంతుండాలి, జులాయిలాగా మందు కొడుతూ వీధుల్లో తిరుగుతుండాలి. ఇలాంటి జులాయికి లక్షల కోట్ల అధిపతి అయిన వాడి కూతురు ప్రేమలో పడుతుంది. ఇలాంటి లవ్‌స్టోరీ సినిమాలకే ప్రేక్షకులు పోటెత్తినట్లు వస్తారు. 'చూడప్పా కన్నప్ప... నేను సింహం లాంటోడ్ని... అది బాత్రూంకెళ్తే కడుక్కోలేదు... నేను కడుక్కోగలను... మిగతా దంతా సేమ్‌టు సేమ్' అని డైలాగ్ పలికే హీరోలకే మన వాళ్లు ఫ్యాన్స్ అయిపోతారు. ఒక్క మాటలో చెప్పాలంటే మన దేశంలో కొంతమందికి విలన్‌లే హీరోలని, ఉగ్రవాదుల విషయంలోనూ ఇదే జరుగుతోందని చెప్పాడు. దేశం ప్రశాంతంగా ఉండాలంటే ఏం చేయాలని మోడీ అడిగాడు. వెంటనే వెంకయ్య... దూరదర్శన్ ఛానెల్ ఒక్కదాన్నే ఉంచి మిగతా న్యూస్ ఛానెల్స్ అన్నింటిని మూయించాలని చెప్పాడు. ఎందుకు? అని రాజ్‌నాథ్ ప్రశ్నించాడు. దూరదర్శన్ ఒక్క ఛానెల్ మాత్రమే ఉన్నప్పుడు చూడండి... దేశం ఎంతో ప్రశాంతంగా ఉండేది. ఈ టీవీ ఛానెల్స్ ఎక్కువయ్యాకే దేశంలో రచ్చలూ రావిళ్లు పెరిగాయి. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు హత్యకు గురైనప్పుడు వారి మరణవార్త తెలిసి గుండెపోటుకు గురైన వాళ్లను చూసామా? ఎందుకంటే ఆరోజుల్లో టీవీ ఛానెల్స్ లేవు. దూరదర్శన్ ఒక్కటే వుండింది. అదీ కాకుండా అప్పట్లో వూరికొకటో, రెండో టీవీలుండేవి. వారి మృతదేహాల వద్ద విషాద సంగీతం, భగవద్గీత శ్లోకాలు వినిపించేవాళ్లు. కాబట్టి ఎవరూ ఉద్రేకపడేవాళ్లు కాదు. అదే వై.యస్.రాజశేఖరరెడ్డి చనిపోయినప్పుడు చూడండి... 600మంది చనిపోయారు. వారిలో పలు టీవీ ఛానెల్స్‌లో వచ్చిన 'చుక్కల్లో కెక్కినాడు సక్కనోడు', 'రాజువయ్యా మహారాజువయ్యా', 'సూర్యుడే సెలవని అలసిపోయేనా'... వంటి పాటలు చూసి ఉద్రేకంతో గుండెపోటుకు గురైన వాళ్లు ఎక్కువ. ఇదంతా కూడా మీడియా పుణ్యమే. కాబట్టి దూరదర్శన్ ఒక్క దాన్నే ఉంచి మిగతా అన్ని టీవీ ఛానెల్స్ లేపేస్తే దేశంలో మునుపటి ప్రశాంతత నెలకొంటుందన్నాడు.

★★★★★

టెన్‌జనపథ్ కార్యాలయం. సోనియా, మన్మోహన్‌సింగ్, గులాం నబీ ఆజాద్, మనీష్ తివారి, దిగ్విజయ్‌సింగ్‌లు కూర్చుని వున్నారు. రాహుల్ గాంధీ హడావిడిగా అప్పుడే బయటకొచ్చి కారెక్కబోతున్నాడు. సోనియాగాంధీ... రాహుల్, సియాచిన్ మంచుకొండల్లో చనిపోయిన జవాన్‌ల కుటుంబాలను ఓదార్చడానికి వెళుతున్నావా అని అడిగింది. అందుకు రాహుల్... నువ్వు ఇంకా మారాలి మమ్మీ, సైనికులు ఓటు బ్యాంకు కాదు, వాళ్లకు కులం, మతం ఉండదు. వాళ్లను పరామర్శిస్తే ఏమొస్తుంది. జెఎన్‌యూలో మతపరమైన ఆందోళనలు జరుగుతున్నాయి. వాళ్లకు మద్దతు తెలిపితే నాలుగు ఓట్లన్నా వస్తాయంటూ కారెక్కాడు. నా కొడుకు ఎన్నాళ్లకు ప్రయోజకుడయ్యాడనుకుంటూ సోనియా గాంధీ కళ్లల్లో ఆనందభాష్పాలు నిండాయి.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉపాధి పథకాలలో స్థిరపడతారు. వృత్తి వ్యాపార జీవనం కలవారికి మంచి అభివృద్ధి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది. కొన్ని అదనపు ఖర్చులు కూడా తప్పవు. చేపట్టిన పనులకు ఆటంకాలుండినా అధిగమించి పనులు జరుపుకొంటారు. గాయాలు తగల వచ్చును. పదవులు, బాధ్యతలు సభ్యత్వాలు స్వీకరిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు చేయండి, నిరుత్సాహపడవద్దు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆర్థిక పటిష్టత ఉండి, వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం పెరుగుతుంది. కొత్త వ్యాపారాలు, నిర్మాణాల వంటివి చేపట్టుతారు. పెద్దలు, ప్రముఖులతో ఆత్మీయత బాగుంటుంది. ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు, అధికారులకు స్థానమార్పులుండవచ్చును. ఖర్చులు పెరిగినా ఇబ్బంది కలుగదు. ఉద్యోగావకాశాలు ఫలించే సమయం. షేర్లపై ఆదాయముంటుంది.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఈ వారం ఖర్చులు బాగా పెరుగుతాయి. అవసరాలకు అప్పు చేయవలసి వస్తుంది. పెద్దమొత్తంలో ఆర్థిక లావాదేవీలను వాయిదా వేసికొనండి. పనులు సరిగా జరగక టెన్షన్ పడుతుంటారు. వ్యాపారాభివృద్ధి అవకాశాలు, పెట్టుబడులకు అవకాశాలు చేజారిపోవచ్చును. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొనండి. గృహ వస్తు వాహన రిపేర్లుండగలవు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి ఉపాధి రంగాల వారికి ఆర్థిక స్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. వ్యాపార వర్గాలకు మంచి అవకాశాలు లభించి ఆదాయం పెరుగుతుంది. మీ ప్రయత్నాలకు పనులు అనుకూలించగలవు. ఉద్యోగులు తమ పైఅధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. స్థాన చలనం కలుగవచ్చును. కుటుంబంలో అభిప్రాయ భేదాలుండినా సర్దుబాటు కాగలవు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కొత్త పెట్టుబడులకు అనుకూల సమయం. బంధువులతో మాట పట్టింపులు, సమస్యలు రావచ్చును. అనుకున్న పనులు ఎంత సమర్థవంతంగా నిర్వహించినా ఆటంకాలుంటాయి. గృహవస్తు వాహన రిపేర్లుంటాయి. బిడ్డల విద్యా వివాహ ఉద్యోగ విషయాలలో శుభ పరిణామాలు చోటు చేసికొంటాయి. అదనపు ఖర్చులు ఏదో ఒక విధంగా తప్పనిసరిగా ఉంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ప్రభుత్వ సంబంధమైన పనులందు అదనపు ఖర్చులు పైనబడగలవు. అనుకున్న పనులు కూడా నిదానంగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడవచ్చును. కాంట్రాక్టర్లకు, వ్యాపారులకు, పరిశ్రమ యాజమాన్యాలకు ప్రభుత్వ వత్తిడి పెరుగుతుంది. దూరప్రయాణాలుంటాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 19.02.2016 నుండి
తేది. 25.02.2016 వరకు

ఈ వారం మిధున కర్కాటక సింహ కన్యా రాశులలో చంద్రుడు, సింహంలో గురురాహువులు, తులలో కుజుడు, 20తేది నుండి వృశ్చికంలో కుజుడు, వృశ్చికంలో శని, మకరంలో శుక్రబుధులు, కుంభంలో రవికేతువులు సంచరిస్తారు.

### పంచాంగము:

ముహూర్తములు

తేది 25 గురువారము ఉదయం గంట 7.30 నుండి గంట 9.0 వరకు మీనలగ్నమున గృహారంభ ఉపనయన వివాహ వ్యాపారములు.

గురువారం సూర్యోదయానికి ముందు గంట 2.56 నుండి గంట 5.20లోగా మకర లగ్నమున వివాహ గృహప్రవేశములు.

### మాఘ మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 19 | శుక్ర | ద్వాదశి | రా॥ గం.10.30వ॥ |
| తేది. 20 | శని | త్రయోదశి | రా॥ గం.10.16వ॥ |
| తేది. 21 | ఆది | చతుర్దశి | రా॥ గం.10.25వ॥ |
| తేది. 22 | సోమ | పూర్ణిమ | రా॥ గం.11.10వ॥ |
| తేది. 23 | మంగళ | పాడ్యమి | రా॥ గం.12.20వ॥ |
| తేది. 24 | బుధ | విదియ | రా॥ గం.1.58వ॥ |
| తేది. 25 | గురు | తదియ | రా॥ గం.3.54వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి. షేర్లు పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. బిడ్డల విద్యా, వివాహ, ఉద్యోగ విషయాలలో అనుకూల పరిణామాలుంటాయి. బంధుత్వాలు బలపడి పరిచయాలు, వ్యాపకాలు పెరుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు నిర్ణయం కావచ్చును.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

పట్టుదలకు పోయి వివాదాలు తెచ్చుకొనకుండా సర్దుబాటు చేసికొంటు పనులు జరుపుకొనండి. వృత్తి వ్యాపార వర్గాలకు అభివృద్ధి అవకాశాలుండి ఆదాయం సంతృప్తికరం. మీపై నిందలు, విమర్శలుంటాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరుగగలవు. డబ్బు వస్తువులు జాగ్రత్తగా కాపాడుకొనండి. ఆరోగ్యం ఫరవాలేదు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి వ్యాపారాలలో ఆర్థికాభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. అయినా ఖర్చులు కూడా ఏదో ఒక రూపంలో పైనబడగలవు. రావలసిన బాకీలు వాయిదా పడతాయి. యాజమాన్యాలు వర్కర్లతో జాగ్రత్తగా ఉండాలి. అనుకున్న పనులు టెన్షన్ పెట్టి, సక్రమంగా జరుగుతాయి. కుటుంబంలో కొంత భిన్నాభిప్రాయాలుండగలవు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థికాభివృద్ధి ప్రయత్నాలు ఫలించగలవు. అయితే ఖర్చులు పెరిగినా భారమనిపించవు. అనుకున్న పనులు నెరవేరగలవు. ఉద్యోగులకు అధికారుల సహకారం ఆదరణ బాగుంటుంది. కొత్త పరిచయాలు కలిగి వాటివల్ల మేలు జరుగుతుంది. ఉద్యోగావకాశాలు లభించగలవు. కోర్టు కేసులందు అనుకూలత బాగుంటుంది. ఇతరులకు సహాయపడటం జరుగుతుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

అనుకున్న పనులకు ఆటంకాలు కలగడం, టెన్షన్, కోపం ఎక్కువగా ఉంటుంది. సమస్యలను ప్రశాంతంగా పరిష్కరించుకొనవలెను. వృత్తి వ్యాపార రంగాలలో మంచి అవకాశాలు చేజారి ఆశించిన స్థితి ఉండదు. ఖర్చులు పెరిగి ఆదాయం సరిపోతుంటుంది. ఉద్యోగులకు పనిభారం, చికాకు శ్రమ ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగావకాశాలకు కొద్దికాలం పట్టవచ్చును.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్థిక వ్యవహారిక ఒప్పందాలకు అనుకూల సమయం. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, రాబడి పెరగడం జరుగుతుంది. ఉద్యోగులకు వ్యాపార రంగాల వారికి ప్రభుత్వం నుండి వత్తిడి ఇబ్బందులుండవచ్చును. రావలసిన బాకీలు కొంత లభిస్తాయి. కోర్టు కేసులందు అనుకూలత కలదు. షేర్లు పెట్టుబడులకు అవకాశాలు దొరకగలవు. పరిచయాలు బలపడతాయి.

# కళ్యాణ వైభవం...!



నెల్లూరు వాస్తవ్యులు రావిళ్ళ రవీంద్రనాథ్ - అనితకుమారిల కుమార్తె **అమూల్య - కార్తీక్**
(హైదరాబాద్ వాస్తవ్యులు మైనేని శ్రీనివాసరావు - భవానిల కుమారుడు)ల కళ్యాణం
ఈ నెల 11వ తేదీ నెల్లూరు గోమతినగర్‌లోని పావని గార్డెన్స్ నందు జరిగింది.
వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



చెన్నైలో వుంటున్న సిద్దారెడ్డి రంగారెడ్డి - కవితల కుమార్తె **శ్రేయ - మధువినీత్**
(గొర్రెపాటి సోమశేఖరరెడ్డి - శ్రీలతల కుమారుడు)ల వివాహం ఈ నెల 17వ తేదీ నెల్లూరులోని
విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనెలు.

## నెల్లూరులో జాతీయస్థాయి హరికథా మహోత్సవాలు



ఈ నెల 18వ తేది నుంచి 20వ తేది వరకు మూడురోజుల పాటు ఎంతో వైభవంగా జాతీయస్థాయి హరికథా మహోత్సవాలను నిర్వహిస్తామని నిర్వాహకులు నిర్మల నరసింహారెడ్డి, మైపాడు రాజా, శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి కమిటీ ప్రతినిధి నలబోలు బలరామయ్యనాయుడు తెలిపారు. ఈనెల17న నెల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, నెల్లూరు టౌన్‌హాలులో ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ సందర్భంగా హరికథా భాగవతార్‌లు ప్రతిరోజూ రెండు హరికథలను గానం చేస్తారని తెలిపారు. ఈ వేడుకల్లో ప్రముఖ నేపథ్యగాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి, టిటిడి మాజీ కార్యనిర్వహణాధికారి డా. కెవి రమణాచారి తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా పలువురు అర్చకులకు కామధేను పురస్కారాలను అందజేస్తామని, క్రీడాకారులకు సత్కారాలు, హరికథా విద్వాంసులకు ప్రోత్సాహకాలు అందజేస్తామని వారు పేర్కొన్నారు. హరికథలను నేటి తరానికి చేరువ చేయాలనే సదాశయంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు అందరూ విచ్చేసి విజయవంతం చేయాలని వారు కోరారు.

## వృద్ధులకు దుప్పట్లు



నెల్లూరుజిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలుగా ఎన్నికైన సందర్భంగా ఈ నెల 14వ తేదీ నెల్లూరు బాలాజీనగర్ లోని గీతామయి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పొత్తూరు శైలజ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులు శైలజను సన్మానించారు. ముఖ్యఅతిథులుగా దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, కర్నాటక రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కో-ఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరి పాల్గొని శైలజను శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు తమ్మినేని పాండు, 3వ డివిజన్ మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



# కావలి కబుర్లు

## రామాయపట్నానికే పోర్టు అనుకూలం

- కేంద్ర కమిటీ వ్యతిరేకించినా దుగరాజపట్నానికి తరలింపు
- వెనుకబడిన ప్రాంతాలకు తీరని అన్యాయం

**- మాజీఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి**



ఆంధ్రప్రదేశ్‌లో పోర్టు ఏర్పాటుకు కేంద్రం నుండి వచ్చిన సర్వే బృందం నివేదికలన్నీ రామాయపట్నానికి అనుకూలం అన్నా, అప్పటి లోక్‌సభ సభ్యులు చింతా మోహన్ ఓట్ల కోసం అప్పటి ప్రధానిమంత్రి మన్మోహన్‌సింగ్‌ను తప్పుద్రోవ పట్టించి కేంద్ర కమిటి వ్యతిరేకించిన దుగరాజపట్నానికి పోర్టు తరలించుకుపోయారని కావలి మాజీ శాసనసభ్యులు వంటేరు వేణుగోపాల్ రెడ్డి ఆరోపించారు. కావలి పట్టణంలోని నమస్కార్ కాన్ఫరెన్స్ హాలులో ఇటీవల విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒంగోలు, కావలి డివిజన్‌లు వెనుకబడిన ప్రాంతాలని, రామాయపట్నంలో పోర్టు ఏర్పాటు చేస్తే వీటితో పాటు కడప, కర్నూలు జిల్లాలోని కొన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కావలి కనకపట్నం కావటానికి రామాయపట్నం పోర్టు ఏర్పాటు ఒక్కటే మార్గమన్నారు. ఈ ప్రాంతంలోని నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. ఈ పోర్టు దుగరాజపట్నం వెళ్లేందుకు మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరోక్షంగా సహకరించారని, కావలి ప్రజల నోట్లో మట్టికొట్టి, వెనుకబడిన ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ఈ రెండు ప్రాంతాలను పోల్చి చూస్తే రామాయపట్నం తీరంలో సముద్రం లోతు సుమారు 60అడుగులు, ఎన్‌హెచ్-5 రహదారి 4 కిలోమీటర్లు, ఎగుమతులకు క్వారీలు, టొబాకో, ప్రత్తి, పప్పుదినుసులు, ధాన్యము మొదలైనవి ఎగుమతి చేయవచ్చు అన్నారు. ఇక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయి. దుగరాజపట్నం అయితే సముద్రం లోతు 20అడుగులు మాత్రమేనని, ఎన్‌హెచ్-5 రహదారి సుమారు 45కిలోమీటర్లు ఉంటుందని, ఇక్కడి భూములు బడాబాబుల ఆధీనంలో ఉన్నాయని అన్నారు. కనుక దుగరాజపట్నంలో పోర్టు ఏర్పాటు ఎట్టిపరిస్థితుల్లో జరగదన్నారు. త్వరలో రామాయపట్నం పోర్టు సాధన కమిటీని ఏర్పాటు చేసి ఉద్యమిస్తామన్నారు.

## చెన్నైలో పూజల్లో బీద



నవ్యాంధ్ర రాజధాని నిర్మాణ సలహా కమిటి సభ్యులు, కావలి మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు ఈ నెల 14న చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని శివాలయం నందు శ్రీ కాళహస్తీశ్వర దేవస్థానం వారి ఆధ్వర్యంలో జరుగుతున్న శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో పాల్గొని కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్యను సాంప్రదాయబద్ధంగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ దైవానుగ్రహం వుంటే సాధించలేనిది ఏమీ లేదని, సత్కార్యాలు నిర్వహిస్తూ ఆ భగవంతుని కృపకు అందరూ పాత్రులు కావాలని కోరారు.

## సమస్యల పట్ల స్పందించని మున్సిపాలిటీ



కావలిలోని 19వ వార్డు ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతుంటే మున్సిపల్ పాలకవర్గం కాని, అధికారులు గాని స్పందించడం లేదని భాజపా రాష్ట్ర కార్యవర్గసభ్యులు కందుకూరి వెంకట సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. 13వ తేదీ ఆయన ఆ వార్డులో పర్యటించారు. గతంలో భారీగా కురిసిన వర్షం కారణంగా 19వ వార్డులో నీరు నిలిచనందున సిమెంటురోడ్డును పగలగొట్టి నీరు వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారని, కానీ ఇప్పటి వరకు సదరు రోడ్డుకు వేసిన గండిని పూడ్చకపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే రోడ్డుపై గండి పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మురుగునీటి కాలువలో పూడిక తీసి ఆ మట్టిని మురుగు కాలవల ప్రక్కనే వేశారని, ఆ పూడిక మట్టిని వెంటనే తొలగించాలని ఆయన కోరారు. మున్సిపల్ కొళాయిలు నేల మట్టంకన్నా దిగువన వున్నాయని, టాప్‌లు బిగించకుండా వదిలేశారని, ఈ కారణంగా అక్కడి ప్రజలు పైపులను కొళాయిలోనికి పంపి త్రాగునీరు పట్టుకోవడం దారుణమన్నారు. మంచినీటి పైపులపై రోడ్లు వేసినందున కొన్ని చోట్ల పైపులు పగిలిపోయి నీరు రోడ్డు మీద ప్రవహిస్తోందని, దీనివల్ల నీరు కలుషితమౌతోందని, వెంటనే మరమ్మతులు చేయాలని కందుకూరి డిమాండ్ చేశారు. అలాగే ఈ వార్డులో పందులు, కుక్కల బెడద ఎక్కువగా ఉందని, పాదచారులపై దాడి చేస్తున్నాయని, ఈ సమస్యను కూడా పరిష్కరించాలని కోరారు. ఆయనతో పాటు కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ సి.వి.సి.సత్యం, రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మమ్మ, 19వ వార్డు ఇన్‌ఛార్జి తొమ్మతాటి ప్రకాశం, శ్రీనివాసులురెడ్డి, బాబు, ఖాదర్ తదితరులు వార్డులో పర్యటించారు.

# నేత్రపర్వంగా పుష్పయాగం




నెల్లూరు మినీబైపాస్ రోడ్డు, శ్రీహరినగర్ బ్యాంకు కాలనీ హౌస్ ఓనర్స్ అసోసియేషన్, శ్రీహరి కల్యాణ సేవా సమితి, హిందూధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కనులపండువగా శ్రీనివాసుని కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కోలాటాలు, పండరీ భజనలు, నగర సంకీర్తనతో కల్యాణోత్సవం ప్రారంభమైంది. రంగురంగుల విద్యుద్దీప కాంతులతో, దేదీప్యమానంగా అలంకరించిన పుష్పాలంకరణ శోభితమైన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణాన్ని అర్చకస్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అన్నమాచార్య కీర్తనల గానం, మేళతాళాలతో మంగళవాయిద్యాలతో శ్రీవారు శ్రీ దేవి, భూదేవిలను పరిణయమాడి భక్తులకు కనువిందు చేశారు. శ్రీహరినగర్ బ్యాంకుకాలని హౌస్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకాటి విజయకుమార్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు కల్యాణ తలంబ్రాలు, కంకణాలు, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి, నూనె మల్లిఖార్జున యాదవ్, ప్రత్తి రవీంద్రబాబు పాల్గొన్నారు.

# విఆర్‌సి వాకర్స్ సర్వసభ్య సమావేశం




విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఈ నెల 14వ తేదీ నెల్లూరులోని నేతాజీ ఫైలట్ హైస్కూల్‌లో జరిగింది. ఈ సమావేశానికి సంస్థ అధ్యక్షులు పందిళ్లపల్లి పట్టాభిరామిరెడ్డి అధ్యక్షత వహించారు. మెగా మెడికల్ క్యాంపు, విఆర్‌సి మైదానం శుభ్ర పరుచుట, మహిళాసభ్యులను చేర్చుకొనే విషయాలపై తీర్మానాలు చేశారు. ఈ తీర్మానాలను సభ్యులందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రమణమూర్తి, గౌరవ అధ్యక్షులు సి.భాస్కర్‌రావు, ట్రెజరర్ వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సభ్యులు ఎం.వి.సుబ్బారెడ్డి, పూర్వపు అధ్యక్షులు కె.సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.వెంకటేశ్వరరావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# నేతాజీలో అక్షరాభ్యాసం



సరస్వతిదేవికి ప్రశస్తమైన వసంత పంచమి సందర్భంగా నెల్లూరులోని శ్రీ నేతాజీ ఫైలట్ హైస్కూల్‌లో ఈ నెల 13వతేదీ 3సంవత్సరాల చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నేతాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు వేదవతి సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్కూలు కరస్పాండెంట్ ఎం.వి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ మూల నక్షత్ర విశిష్టతను, ఆచార వ్యవహారాలు, సంస్కృతులు చిన్నతనం నుండి విద్యార్థులకు విద్యతో పాటు అందిస్తే వారు మంచిపౌరులుగా రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె.నరేంద్రరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ప్రసన్న, వి.సుధాకరరావు, వైస్‌ప్రిన్సిపల్ డి.వాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హీరో.. దేశానికి జీరో

అదేం దరిద్రమోగాని భారతదేశంలో జాతీయవాదం కంటే కులవాదం, మత వాదం అత్యంత శక్తివంతంగా ఉంటున్నాయి. భారతదేశ వర్తమాన పరిస్థితులపై అవే ప్రభావం చూపిస్తున్నాయి. సియాచిన్ మంచులోయల్లో 9మంది సైనికులు మృతి చెందితే... దానికి పెద్దగా ప్రాధాన్యత లేదు. ఆ చనిపోయింది మన దేశం వాళ్లు కాదులే అన్నట్లు ఇక్కడ రాజకీయ పార్టీలు వ్యవహరించాయి. కాని హైదరాబాద్ యూనివర్శిటీలో యాకుబ్ అనే ఉగ్రవాది మద్దతుదారుడొకరు ఆత్మహత్య చేసుకుంటే, ఢిల్లీలోని జెఎన్‌యులో అఫ్జల్ గురు అనే ఉగ్రవాది సానుభూతిపరుడొకరిని పోలీసులు అరెస్ట్ చేస్తే... దేశంలోని పలు రాజకీయ పక్షాలు చేస్తున్న కాకిగోల చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోంది. జాతీయ వాదం ఈ దేశంలో చచ్చిపోతున్నదేమో ననిపిస్తోంది. ఈ దేశంలో వుంటూ ఈ దేశం తిండి తింటూ, ఈ ప్రభుత్వం ఇస్తున్న సౌకర్యాలను అనుభవిస్తూ, పాలు త్రాగి విషం కక్కిన కాలనాగుల్లా 'ఇండియా డౌన్‌డౌన్' అని నినాదాలు చేస్తున్న దేశద్రోహులకు మద్దతుదారులుగా నిలిచిన ప్రముఖులను చూస్తుంటే అసహ్యమేస్తోంది. ఓట్ల కోసం ఇంత నీచానికి దిగజారాలా? అని ఆవేదన కలుగుతోంది.

ఇలాంటి వితండ విద్రోహపు చర్యలకు వత్తాసుపలుకుతున్న వారిలో దేశానికి భావిప్రధానిగా కాంగ్రెస్ ప్రచారం చేస్తున్న రాహుల్‌గాంధీ ఉండడం చూస్తుంటే ఈ దేశంపై అతనికున్న ప్రేమ, భక్తి ఏంటో అర్థమవుతుంది. ఇలాంటి వాడిని ప్రధానిని చేస్తే దేశ భద్రత, భవిష్యత్ ఎలా ఉంటుందా అన్నదానిపై అందరిలోనూ ఆందోళన నెలకొంటుంది. దేశభక్తి నా ఇంట్లోనే కాదు నా ఒంట్లోనూ ఉందన్న రాహుల్ గాంధీది ఏ దేశానికి చెందిన భక్తి అని పలువురు జాతీయవాదులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల చోటుచేసుకున్న రెండు సంఘటనల ద్వారా రాహుల్‌గాంధీ దేశభక్తి ప్రశ్నార్థకంగా మారింది. ఈ రెండు సంఘటనలు కూడా ఈ కాంగ్రెస్ హీరోను దేశ భక్తుల దృష్టిలో విలన్‌గా నిలిపాయి.

ప్రపంచంలో పెద్ద ప్రజాస్వామ్య దేవాలయమైన భారత పార్లమెంటు మీద దాడి చేసిన ఉగ్రవాది ఒకరు... ముంబైలో బాంబు పేలుళ్లకు పాల్పడి వందలాది మందిని పొట్టనపెట్టుకున్న ఉగ్రవాది ఇంకొకరు. వీళ్లిద్దరికీ ఉరిశిక్షలు అమలు జరిగాయి. భారత సర్వోన్నత న్యాయ స్థానమే ఉరిశిక్షే వీరికి తగిన శిక్ష అని తీర్పునిచ్చింది. ఇలాంటి ఉగ్రవాదులకు యూనివర్శిటీలలో వత్తాసు పలుకుతూ సంతాపసభలు నిర్వహిస్తూ, వాళ్లను అమరవీరులతో పోలుస్తూ, ఇండియాకు వ్యతిరేకంగా నినాదాలు చేసినవారిని ఏమనాలి? దేశద్రోహులనే చెప్పాలి. అలాంటి వారికి మద్దతుగా నిలుస్తున్న రాహుల్‌గాంధీని మరి ఏమనుకోవాలి.

రాజకీయాలు వేరు... సైద్ధాంతికంగా ప్రభుత్వాలతో విభేదించడం వేరు? దేశద్రోహపు ఘటనలను కూడా రాజకీయ కోణంలో చూస్తున్న రాహుల్‌ది నిజంగా భారత్ రక్తమేనా?

హైదరాబాద్ యూనివర్శిటీలో ఆత్మహత్య చేసుకున్న రోహిత్ వేముల కోసం ఆయన రెండుసార్లు హైదరాబాద్ వచ్చారు. కేవలం కులం కోణంతోనే ఆయన ఈ సంఘటనను చూశారు. ఒక్క యాకూబ్ చనిపోతే ఇంటికొక యాకూబ్ పుడతాడన్న రోహిత్‌లోని విద్వేషాన్ని చూడలేదు. రోహిత్ స్థానంలో ఏ అగ్రవర్ణానికి చెందిన విద్యార్థో ఉండుంటే రాహుల్ ఇన్నిసార్లు హైదరాబాద్ వచ్చేవాడా? నిన్న ఢిల్లీలోని జెఎన్‌యులో జరిగింది విద్రోహపు ఘటనే! భారత ప్రజాస్వామ్య వ్యవస్థపైనే దాడికి తెగబడ్డ ఉగ్రవాదికి భారత ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థలలో వర్ధంతులు సంతాప సభలేంటి? దేశ వ్యతిరేక నినాదాలేంటి? ఇలాంటి విద్రోహశక్తులకు ప్రధాన ప్రతిపక్షనేతగా వున్న రాహుల్ మద్దతు తెలపడమేంటి? దేశ సమైక్యత, జాతీయవాదం పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్న రాహుల్ నాయకత్వంపై ఈరోజు దేశ ప్రజలకున్న అంచనాలన్నీ వమ్మయ్యాయి. ఇతను దేశ నాయకుడు కాదు, విదేశీ న్యాయకుడని ప్రజలు ఛీదరించుకునే పరిస్థితి వచ్చింది.

# గోబెల్స్ గేమ్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర రాజకీయాలను అబద్దాలే ప్రభావితం చేస్తున్నాయి. కాబట్టే అలాంటి రాజకీయాన్ని చంద్రబాబు త్రికరణ శుద్ధిగా నమ్ముతున్నాడు. తెలంగాణలో తన పార్టీ భూస్థాపితమవుతుందన్న నిజాన్ని కప్పిపెట్టడానికి ఆయన ఆంధ్రప్రదేశ్‌లో వైకాపాను టార్గెట్‌ను చేసుకున్నాడు. ఓ 30మంది వైకాపా ఎమ్మెల్యేలు తెలుగుదేశంలో చేరడానికి సిద్ధంగా వున్నారనే ఓ గోబెల్స్ ప్రచారం చూస్తున్నాం. తెలుగుదేశం అనుకూల మీడియా ఈ ప్రచారం సృష్టిస్తోంది. 1995 ఆగష్టులో ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడవడానికి వేసిన ఎత్తులనే ఇప్పుడు వైకాపా మీద ప్రయోగిస్తున్నారు. ఆరోజు వైశ్రాయ్ హోటల్‌లో ఉన్న ఒకరిద్దరు చంద్రబాబు అనుకూల ఎమ్మెల్యేలతోనే కథంతా నడిపించి ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడిని చేశాడు. ఆరోజు వైశ్రాయ్‌లో ఎమ్మెల్యేలు ఎక్కువమంది ఉన్నారని చెప్పి గోబెల్స్ ప్రచారం చేయడం ద్వారా చంద్రబాబుకు సీఎం కుర్చీ దక్కింది. మరి ఈరోజు నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, చిత్తూరు, కర్నూలు, కడప జిల్లాలకు చెందిన 30మంది ఎమ్మెల్యేలు తెలుగుదేశంలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని ప్రచారం రేపారు. దీనిని ఆయా జిల్లాల వైకాపా ఎమ్మెల్యేలే ప్రెస్‌మీట్‌లు పెట్టి ఖండించారు. ఒకరిద్దరు వైకాపా ఎమ్మెల్యేలు టీడీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారనే విషయం అందరికీ తెలుసు. మరి 30మంది ఎమ్మెల్యేలు వైకాపాను వీడి తెలుగుదేశంలో చేరాల్సిన అవసరం ఉందా? ప్రస్తుతం తెలుగుదేశంలో వున్న ఎమ్మెల్యేలే ఎంతో అసంతృప్తితో ఉన్నారు. మరి వైకాపా ఎమ్మెల్యేలు అక్కడ చేరి పొడిచేదేమిటి? తెలంగాణలో కేసీఆర్ యమస్పీడుగా పని చేసుకుపోతున్నాడు కాబట్టి తెలుగుదేశం, కాంగ్రెస్‌వాళ్లు టీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. వచ్చే ఎన్నికలలోనూ టీఆర్‌ఎస్ గెలుస్తుందనే భరోసా ఆ పార్టీలో చేరుతున్న నాయకులకు వుంది. ఏపిలో అలాంటి భద్రత, భరోసా తెలుగుదేశం ఇవ్వలేదు. ఈరోజుకీరోజు ఎన్నికలొచ్చినా పరిస్థితులు వేరుగా ఉంటాయి. ఫలితాలు ఇంకా వేరుగా ఉంటాయి. చంద్రబాబు చేస్తున్న పనులు అమలు చేస్తున్న పథకాల వల్ల ప్రజల్లో విపరీతమైన ఆదరణ పెరుగుతుంటే వైకాపా ఎమ్మెల్యేలు అటు వైపు మొగ్గు చూపుతారు. కాని తెలుగుదేశం ప్రభుత్వం పట్ల ప్రజావ్యతిరేకత పెరుగుతున్న తరుణంలో ఎవరు మాత్రం ఆ పార్టీలో చేరడానికి సాహసిస్తారు. వైకాపా ఎమ్మెల్యేలను చేర్చుకుంటే ఆ పార్టీని బలహీన పరచవచ్చునుకోవడం కూడా మూర్ఖత్వమే. చంద్రబాబు మీద ప్రజల్లో పూర్తి వ్యతిరేకత వస్తే వైకాపా నిర్వీర్యమైనా ఆ స్థానంలో 'లోక్‌సత్తా' వంటి పార్టీ వున్నా ప్రజలు ఆ పార్టీకి పట్టం కడతారు. ఏడాది క్రితం ఢిల్లీ రాష్ట్ర ఎన్నికల్లో జరిగిందిదే! అక్కడ జాతీయపార్టీలైన కాంగ్రెస్, బీజేపీలను కాదని ప్రజలు 'ఆప్'కు పట్టం కట్టారు. కాబట్టి పాలకులనేవాళ్లు తమ పనితీరు ద్వారా ప్రజాదరణను పెంచుకోవడానికి ప్రయత్నించాలే గాని, ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసినంత మాత్రాన ఉపయోగం ఉండదనే విషయం ఢిల్లీ ఎన్నికల ద్వారా బుజువైంది.

వైకాపా ఎమ్మెల్యేలు మా పార్టీలోకి వస్తున్నారని ప్రచారం చేసుకున్నా, తెలుగుదేశం ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారని చెప్పుకున్నా ఇరువురిది గోబెల్స్ ప్రచారమే. దీనివల్ల ఎవరికీ ఉపయోగం లేదు. తెలుగుదేశం ఎమ్మెల్యేలకు జగన్‌తో ఇప్పటికిప్పుడు టచ్‌లో ఉండాల్సిన అవసరం లేదు. అధికారపార్టీలో ఉంటే వాళ్ల పనులు సాఫీగా జరిగిపోతాయి. ప్రతిపక్షంలోకి పోతే ఉపయోగమేముంటుంది. అటు ఇటూ మారడం ఏదన్నా జరిగితే అది ఎన్నికలప్పుడే! ఈలోపు గుంపుగా ఎమ్మెల్యేలు పార్టీలు మారుతున్నారనడం గోబెల్స్ ప్రచారమే! ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ గోబెల్స్ గొడవలు అవసరమా?

# షాడో మేయర్

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేషన్ కార్యాలయం గేటు కూడా దాటలేదు. మేయర్ ముసుగులో షాడో మేయర్‌లా అవినీతి రాజ్యమేలుతున్నారు. అజీజ్ మేయర్ అయిన కొత్తలో ఆనం వెంకటరమణారెడ్డి షాడో మేయర్‌గా కొంతకాలం వెలిగారు. మేయర్ తరపు ప్రతినిధిగా ఆయనే కార్పొరేషన్‌లో అవినీతి వ్యవహారాలు చూశారు. అయితే 'షాడో మేయర్' గురించి మీడియాలో పెద్దఎత్తున విమర్శలు రావడంతో చాలారోజులు నుండి ఆనం వెంకటరమణారెడ్డిని పక్కనపెట్టారు.

ఇప్పుడు వాళ్లను వీళ్లను నమ్ముకోకుండా మేయర్ అజీజ్ సోదరుడైన కార్పొరేటర్ జలీల్ ప్రత్యక్షంగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం షాడో మేయర్ పోస్టును జలీల్ తీసుకొని వున్నాడు. మేయర్ తరపున కలెక్షన్‌లు, కమిషన్ల వ్యవహారమంతా ఇతనే చూసుకుంటున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాల్ని వీళ్లు కల్పవృక్షంగా భావిస్తున్నారు. నగరంలో ఎక్కడికక్కడ కమర్షియల్, లేదా గృహ సంబంధ నిర్మాణాలు జరుగుతున్నాయో వాటి జాబితాను తెప్పించుకోవడం, అందరికీ ఫోన్‌లు చేయడం, ప్రతి భవనానికి అవినీతి రుసుం వసూలు చేయడం చేస్తున్నారని సమాచారం. నగరంలో ఎవరు బిల్డింగ్ కడుతున్నా వెళ్లి జలీల్‌ను కలుసుకోవాలనే ప్రచారం వుంది. నగరంలో పూర్తయిన ఎన్నో భవనాలు, అపార్ట్‌మెంట్లకు గతంలో కార్పొరేషన్ అధికారులు ఎన్‌ఓసిలను నిలిపేసి ఉన్నారు. ఎన్‌ఓసి ఇస్తేగాని కార్పొరేషన్ తాకట్టులో వున్న ఫ్లాట్లు, భవనాలు రిలీజ్ కావు. ప్లాన్ అప్రూవల్‌కు విరుద్ధంగా కట్టిన భవనాలకు అధికారులు ఎన్‌ఓసిలు నిలిపేస్తుంటారు. అలాంటి అక్రమ భవనాలన్నింటికి కూడా ఇప్పుడు కమిషన్‌లు తీసుకుని ఎన్‌ఓసిలు ఇస్తున్నారని తెలుస్తోంది. నగరంలో బిపిఎస్ క్రింద భవనాల క్రమబద్దీకరణ కోసం వేలసంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. బిపిఎస్ దరఖాస్తుదారు నుండి కూడా లంచాలు తీసుకుని వాటిని ఆమోదించే విధంగా అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. టౌన్‌ప్లానింగ్‌లోనే అవినీతి ఒక స్థాయిలో వుంటుంది. ఇప్పుడు పెరిగిన అవినీతిని టౌన్‌ప్లానింగ్ సిబ్బందే తట్టుకోలేకపోతున్నారు. ఇటీవల టిపిఓ ఒకరు ఈ స్థాయి అవినీతిని తట్టుకోలేకే బదిలీ చేయించుకుని వెళ్లారు. ఈమధ్య నగరంలో జరిగిన టెండర్ల గొడవ తెలిసిందే! 14కోట్ల పనులను కమిషన్ల వాటా లేసుకుని పంచుకున్నారు. పోటీ టెండర్లు పడేసరికి ఆ టెండర్లనే రద్దు చేయించారు.

నెల్లూరు నగరపాలక సంస్థలో అవినీతి ఎంతగా పెరిగిపోయిందనడానికి ఇవి మచ్చుతునకలు. ఇంతకుముందు పాలకులు మాంసం తిని ఎముకలన్నా మిగిలించే వాళ్లు. ఇప్పటి పాలకులు కనీసం ఆ ఎముకలను కూడా మిగిల్చే పరిస్థితులు కనిపించడం లేదు.



# నెల్లూరు సీమలో గాయత్రి వెలుగులు

## • 27న ప్రారంభోత్సవం • ముఖ్యమంత్రి, కేంద్రమంత్రుల రాక

ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ సభ్యులు, గాయత్రి గ్రూప్ వ్యవస్థాపకులైన టి.సుబ్బరామిరెడ్డి విద్యుత్ ఉత్పత్తి రంగంలోనూ రాణిస్తూ, తనదైన శైలిలో భారీస్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుడుతున్నారు. నెల్లూరుసీమకే కాక, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాలకు కూడా టిఎస్సార్ వెలుగులు అందించనున్నారు. అటు రాజకీయ రంగంలోనూ, ఇటు కళారంగంలోనూ ఆణిముత్యంలా వెలుగొందుతోన్న టిఎస్ఆర్, పారిశ్రామికరంగంలోనూ అగ్రశ్రేణిలో వుంటూ విద్యుత్ ఉత్పత్తి రంగంలో దేశవ్యాప్త ఖ్యాతిని అందుకునేవిధంగా నెల్లూరు సముద్రతీర ప్రాంతంలోని నేలటూరులో ఎంతో అద్భుతమైన రీతిలో సెంబ్‌కార్ప్ గాయత్రి పవర్ కాంప్లెక్స్ విద్యుత్ ప్లాంట్‌ను నెలకొల్పారు. ఈ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. నెల్లూరు సమీపంలోని ముత్తుకూరు మండలంలోని నేలటూరు గ్రామంలో ఈ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుచేశారు. సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ (సింగపూర్), మరియు గాయత్రి ప్రాజెక్ట్స్ (హైదరాబాద్) వారి ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన ఈ ప్రాజెక్ట్‌కు ప్రారంభోత్సవం జరుగనుంది. 2640 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తిచేసే ఈ పవర్ కాంప్లెక్స్‌కు ఆ రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభోత్సవం చేయనున్నారు. కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఎం. వెంకయ్యనాయుడు, సింగపూర్ వాణిజ్య పరిశ్రమలశాఖ మంత్రి ఎస్.ఈశ్వరన్‌లు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొంటారు. ఈ సందర్భంగా జరిగే పవర్‌ప్లాంట్ కంట్రోల్ సెంటర్ ప్రారంభోత్సవంలో కేంద్ర విద్యుత్‌మంత్రి పీయూష్‌గోయల్, కేంద్ర పర్యావరణ, అటవీశాఖల మంత్రి ప్రకాష్‌జవదేకర్, కేంద్ర శాస్త్ర సాంకేతికశాఖల మంత్రి వై.ఎస్ చౌదరి, సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ ఛైర్మెన్ అంగ్‌కాంగ్ హువా (సింగపూర్), సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ సిఇఓ తాంగ్‌కిన్ ఫీలు పాల్గొంటారు. రాజ్యసభ సభ్యులు, సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ సభ్యులు, గాయత్రి గ్రూప్ వ్యవస్థాపకులు టి.సుబ్బరామిరెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారు. హిందుజా గ్రూప్ కంపెనీల కో-ఛైర్మెన్ జిపి హిందుజా, ఎస్సార్ గ్రూప్ ఛైర్మెన్ శశిరుయా, అపోలో హాస్పిటల్స్ గ్రూప్ వ్యవస్థాపక ఛైర్మెన్ డాక్టర్ పి.సి రెడ్డి, జివికె గ్రూప్ వ్యవస్థాపక ఛైర్మెన్ డాక్టర్ జివి కృష్ణారెడ్డి, జిఎంఆర్ గ్రూప్ ఛైర్మెన్ జిఎం రావ్, విడియోకాన్ గ్రూప్ ఛైర్మెన్-మేనేజింగ్ డైరెక్టర్ విఎన్ దూత్, నవయుగ గ్రూప్ ఛైర్మెన్-ఎం.డి సివి రావ్, ఎన్‌సిసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ ఏఏవి రంగరాజు తదితర ప్రముఖులు పాల్గొంటారు. విశిష్ట అతిథులుగా రాష్ట్ర రవాణా, రోడ్లు భవనాలశాఖ మంత్రి సిద్దా రాఘవరావు, రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ, రాష్ట్ర విద్యాశాఖ, మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్ బి.రాఘవరెడ్డిలతో పాటు, ప్రత్యేక అతిథులుగా ఎంపి డా.కెవిపి రామచంద్రరావు, మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీలు వై.వి.సుబ్బారెడ్డి, వి.వరప్రసాదరావు, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పి. అనిల్‌కుమార్‌యాదవ్, సర్వేపల్లి మాజీఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి, గాయత్రి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ టివి సందీప్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మెన్ జె.బ్రిజ్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొంటారు.


## ప్రఖ్యాత నెఫ్రాలజిస్ట్‌కు హృదయపూర్వక స్వాగతం



ఫిబ్రవరి 15వ తేదీ, సోమవారం నుండి
సింహపురి హాస్పిటల్స్ నందు తమ వైద్య సేవలందిస్తున్న

**డా॥ మాధవ్ దేశాయి**
M.D. (జనరల్ మెడిసిన్), D.M. (నెఫ్రాలజి, నిమ్స్)
సీనియర్ నెఫ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్
మెంబర్ - ఇంటర్నేషనల్ సొసైటి ఆఫ్ నెఫ్రాలజి
కరస్పాండింగ్ మెంబర్ - అమెరికన్ సొసైటి ఆఫ్ నెఫ్రాలజి
ట్రెజరర్ - ఇండియన్ సొసైటి ఆఫ్ నెఫ్రాలజి-సదరన్ చాప్టర్

అపాయింట్ మెంట్ కొరకు :
సెల్ : 8008 104 224

ఎన్ హెచ్ - 5, చింతారెడ్డిపాలెం
క్రాస్‌రోడ్స్, నెల్లూరు
T: 0861-6680100

Simhapuri Hospitals
Multi-Super Specialty Services






# ఉత్తరక్రియలు

నిష్కల్మషి, నిస్వార్థసేవాతత్పరుడు, నిరంతర ప్రజాసేవకుడు

## చిట్టమూరు పద్మనాభరెడ్డి గారు

(మాజీ వైస్‌ఛైర్మెన్, జిల్లా ప్రజాపరిషత్, నెల్లూరుజిల్లా)

తే. 09.02.2016ది మంగళవారం పరమపదించినారు.

వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

**చిట్టమూరు అనసూయమ్మ** - భార్య

**డా॥ చిల్లకూరు మోహన్‌రెడ్డి**, చెన్నై - బావమరిది
**ప్రొ॥ సి.యం.కె.రెడ్డి**, చెన్నై - అల్లుడు
**చిల్లకూరు నిర్మల** - కుమార్తె
**డా॥ చిట్టమూరు భారతి**, చెన్నై - కోడలు

**డా॥ చిల్లకూరు కిషోర్**, చెన్నై - మనుమడు
**కొవ్వూరు హరిత**, కాకినాడ - మనుమరాలు
**చిట్టమూరు ప్రణీత**, USA - మనుమరాలు
**చిట్టమూరు లోహిత్**, చెన్నై - మనుమడు

**ఉత్తరక్రియలు:** తే.24.02.2016ది బుధవారం ఉదయం 10గంటలకు మనుబోలు గ్రామంలోని వారి స్వగృహమునందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com